


PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక
సంపుటి: 5 సంచిక: 184, పేజీలు - 08
మంగళవారం, డిసెంబర్ 16, 2025 వెల: 5 రూ/.
హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




## విస్తా "రణం"

### హస్తిన పర్యటన వెనక అదే బలమైన కారణమా..?





హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయింది. ఇప్పటి వరకూ రెండుసార్లు మంత్రి వర్గ విస్తరణ జరిగింది. ఇంకా రెండు మంత్రి పదవులు రేవంత్ రెడ్డి కేబినెట్ లో ఖాళీగా ఉన్నాయి. ఇటీవల జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు ముందు మహ్మద్ అజారుద్దీన్ ను ఒక్కరే మంత్రి వర్గంలోకి తీసుకున్నారు. మరో రెండు పదవులు రెండేళ్లుగా ఖాళీగా ఉన్నాయి. దీంతో మంత్రి వర్గ విస్తరణ జరపాలని పార్టీ రాష్ట్ర నేతలు భావిస్తున్నారు. మరో మూడేళ్ల మాత్రమే సమయం ఉండటంతో మంత్రివర్గ విస్తరణ చేయకుండా నాన్చడం భావ్యం కాదన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా గత రెండు, మూడు రోజుల నుంచి ఢిల్లీలోనే ఉండి పార్టీ పెద్దలను కలిసి మంత్రి వర్గ విస్తరణపై చర్చించినట్లు సమాచారం.

#### ముఖ్య నేతల అభిప్రాయం మేరకు

అయితే మంత్రి వర్గ విస్తరణ చేయాలంటే ముందుగా మంత్రివర్గంలోనూ కొంత ప్రక్షాళన చేయాలని రేవంత్ రెడ్డి భావిస్తున్నట్లు తెలియవచ్చింది. కొందరికి రెండేళ్లపాటు మంత్రిపదవిగా అవకాశమిచ్చినందున మరికొందరికి అవకాశం ఇవ్వాలంటే మంత్రివర్గ ప్రక్షాళన చేయాలని ఆయన నిర్ణయం తీసుకున్నారని సమాచారం. కొందరిని మంత్రి వర్గం నుంచి తప్పించి మరికొందరికి సామాజికవర్గం, ప్రాంతాలకు తగినట్లుగా మంత్రి వర్గం ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి భావిస్తున్నారు. హైకమాండ్ మాత్రం ఇందుకు అంగీకరించిందా? లేదా? అన్నది తెలియక రాకపోయినా పంచాయతీ ఎన్నికలు ముగిసిన తర్వాత మంత్రి వర్గ విస్తరణ చేపడితేనే రానున్న ఎన్నికలకు తన టీం ను సిద్ధం చేసుకోవాలన్నది రేవంత్ ఆలోచనగా ఉంది.

#### ప్రక్షాళన చేసిన తర్వాత

ఉన్న మంత్రివర్గంలో సభ్యులను అలాగే ఉంచి కేవలం ఖాళీగా ఉన్న మంత్రి పదవులను భర్తీ చేసినట్లయితే ఆశావహుల్లో మరింత నిరాశ ఎదురవుతుందని రేవంత్ రెడ్డితో పాటు రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్య నేతల అభిప్రాయంగా కూడా ఉంది. ఖాళీగా ఉన్న మంత్రి పదవులు రెండింటితో పాటు మరో నలుగురిని అయినా తప్పించగలిగితే ఆరుగురికి కొత్త వారికి అవకాశం దక్కుతుందని, అప్పుడు ఎలాంటి అసంతృప్తులు ఉండవన్న

2లో..

### 9 రోజుల్లోనే.. రూపురేఖలు
## మారిపోయాయ్

### - అది డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అంటే



అమరావతి (ప్రశ్న న్యూస్) ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మరోసారి తన పెద్దమనసు చాటుకున్నారు. కేవలం 9 రోజుల వ్యవధిలోనే ఇచ్చిన మాట నిలబెట్టుకుని దటీజ్ పవన్ కళ్యాణ్ అనిపించుకున్నారు. హామీ ఇచ్చిన తొమ్మిది రోజుల్లో ఓ పాఠశాలకు 25 కంప్యూటర్లు, లైబ్రరీ నిండుగా పుస్తకాలు సమకూర్చారు పవన్ కళ్యాణ్. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే చిలకలూరిపేట శారదా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో

2లో..

### దీదీపై బీజేపీ
## సంచలన పోస్టు

### - హిట్లర్ తో పోల్చుతూ..



**కోల్కతా (ప్రశ్న న్యూస్)** వచ్చే ఏడాది బెంగాల్ లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న విషయం తెలిసిందే. అయితే ఇప్పటినుంచే అక్కడి రాజకీయాలు హాట్ హాట్ గా సాగుతున్నాయి. ఎలాగైనా బెంగాల్ లో అధికారం చేజిక్కించుకోవాలని బీజేపీ ప్రయత్నాలు మెదలుపెట్టింది. మరోవైపు అధికారాన్ని కాపాడుకునేందుకు మమతా బెనర్జీ సారథ్యంలోని తృణమూల్ కాంగ్రెస్ సర్వశక్తులూ వడ్డుతోంది. ఈ నేపథ్యంలో ఈ సారి పశ్చిమ్ బెంగాల్ లో అసెంబ్లీ ఎన్నికలు తీవ్ర ఉత్కంఠను రేపుతున్నాయి. ఇప్పటికే వరుసగా మూడు సార్లు రాష్ట్రంలో విజయం సాధించిన తృణమూల్ కాంగ్రెస్ ను ఎలాగైనా ఈ ఎన్నికల్లో పడగొట్టాలని బీజేపీ యత్నిస్తోంది. ఈ క్రమంలో బెంగాల్ లో రాజకీయ వేడి అలుముకుంది. ప్రత్యర్థి, అధికార పార్టీ నేతల మధ్య ఆరోపణలు ప్రత్యారోపణలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో బీజేపీ బెంగాల్ యూనిట్

2లో..

## పొట్టిశ్రీరాములు యావత్ తెలుగు ప్రజల ఆస్తి

### - పొట్టిశ్రీరాములు ఆత్మార్పణ దినాన్ని 'డే ఆఫ్ శాక్రిఫైస్'గా ప్రకటన - అమరావతిలో 'స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్' నిర్మిస్తామన్న ముఖ్యమంత్రి

### - పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీలపై విపక్షాల విమర్శలను తిప్పికొట్టిన సీఎం

అమరావతి (ప్రశ్న న్యూస్) తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టిశ్రీరాములు ఆత్మార్పణ దినాన్ని ఇకపై అధికారికంగా 'డే ఆఫ్ శాక్రిఫైస్' (త్యాగాల దినం)గా నిర్వహిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఆయన త్యాగానికి గుర్తుగా రాజధాని అమరావతిలో 'స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్' నిర్మిస్తామని వెల్లడించారు. సోమవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన పొట్టిశ్రీరాములు ఆత్మార్పణ దినం కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా పొట్టిశ్రీరాములు కుటుంబ సభ్యులను శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ "బ్రిటిష్ వారిపై స్వాతంత్ర్యం

2లో..





### సర్పంచులను వేధిస్తే
## ఊరుకోం

### - ప్రతి జిల్లాలో 'లీగల్ సెల్' ఏర్పాటు

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** రాష్ట్రంలో కొత్తగా ఎన్నికైన సర్పంచులను ఇబ్బంది పెట్టాలని చూస్తే సహించేది లేదని, వారి రక్షణ కోసం ప్రతి జిల్లాలో బిఆర్ఎస్ పార్టీ తరపున ప్రత్యేక న్యాయ విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నామని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. ఆదివారం సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో రాజన్న సిరిసిల్ల జిల్లా నుండి గెలుపొందిన నూతన సర్పంచుల సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గెలిచిన అభ్యర్థులను అభినందిస్తూ, వారికి భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. సర్పంచ్ ఎన్నికల్లో గెలిచిన బిఆర్ఎస్ మద్దతుదారులు కాంగ్రెస్ పార్టీ బెదిరింపులకు భయపడవద్దని కేటీఆర్ భరోసా ఇచ్చారు.

2లో..

### కేంద్ర విద్యాశాఖ మంత్రి
## ధర్మేంద్ర ప్రధాన్‌తో లోకేశ్ భేటీ

- రాష్ట్రంలో చేపడుతున్న విద్యా సంస్కరణలను కేంద్ర మంత్రికి వివరణ
- 11 నవోదయ విద్యాలయాలు, రూ.4,400 కోట్ల నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి
- 155 స్మార్ట్ కిచెన్ల ఏర్పాటుకు అనుమతి కోరిన రాష్ట్ర ప్రభుత్వం



అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్‌లో విద్యా ప్రమాణాలను పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలకు కేంద్రం పూర్తి సహకారం అందించాలని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం నాడు దేశ రాజధాని ఢిల్లీలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో సమావేశమయ్యారు. ఈ భేటీలో కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, ఇతర ఎంపీలు పాల్గొన్నారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు

2లో..

### జీహెచ్ఎంసీ డివిజన్ల
## పెంపుపై అభ్యంతరాలు

- హైకోర్టులో పిటిషన్ దాఖలు
- పిటిషన్‌ను అత్యవసరంగా విచారించాలని కోరిన పిటిషనర్
- ప్రజల అభ్యంతరాలు పట్టించుకోలేదని ఆరోపణ

2లో..



### 2029 ఎన్నికల్లో
## పోటీ చేస్తాం

- జాగృతిని రాజకీయ పార్టీగా మార్చే దిశగా సంకేతాలు
- తెలంగాణ నలుమూలల్లో జాగృతి విస్తరణ
- కవిత విజన్, మిషన్ ఇదే



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) గత కొద్ది కాలంగా తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత రాజకీయాల్లో చాలా చురుగ్గా ఉంటున్నారు. కుటుంబం, బీఆర్ఎస్ పార్టీ నుంచి బయట వచ్చి ఆ పార్టీ నాయకులపై తీవ్రంగా విమర్శలు చేస్తూ సంచలనం సృష్టిస్తున్నారు. మరోవైపు అధికార పక్షంపై కూడా విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో కవిత సొంతంగా పార్టీ పెట్టే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో కవిత కీలక ప్రకటన చేశారు. 2029లో తాను ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు వెల్లడించారు. సోమవారం సాయంత్రం 4 గంటల నుండి 5 గంటల వరకు ఎక్స్ వేదికగా ఆస్క్ కవిత పేరుతో క్వశ్చన్ అవర్ నిర్వహించిన సందర్భంగా

2లో..

### రవీంద్రభారతిలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం
## కాంస్య విగ్రహావిష్కరణ

### - ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) గాన గంధర్వుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి స్వర్గీయ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జ్ఞాపకార్థం హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కాంస్య విగ్రహాన్ని భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సోమవారం ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, ఎస్పీబీతో తనకున్న అనుబంధాన్ని, ఆయన గొప్పతనాన్ని స్మరించుకున్నారు. అశేష ప్రజల అభిమానాన్ని పొందిన గొప్ప వ్యక్తి విగ్రహాన్ని ఆవిష్కరించడం సంతోషంగా ఉందని

2లో..



## దేవుడికి విశ్రాంతి వేళలు ఉంటాయి



### - ప్రత్యేక పూజలపై సుప్రీంకోర్టు అసహనం

**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** ఉత్తరప్రదేశ్‌లోని మధుర బాంకీ బీహారీజీ మహారాజ్ ఆలయంలో దర్శన సమయాల మార్పుపై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తం చేసింది. దేవుడికి విశ్రాంతి సమయంలో ప్రత్యేక పూజలు చేయడమేమిటని ప్రశ్నించింది. ఇక్కడి ఆలయం దర్శన వేళలు, పూజా విధానాల్లో మార్పులను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపిన న్యాయస్థానం భక్తుల నుంచి డబ్బులు తీసుకుని ప్రత్యేక పూజలు చేయడాన్ని తప్పుబట్టింది. దేవుడి విశ్రాంతి వేళల్లో ప్రత్యేక పూజలు చేయడం సమంజసం కాదని వ్యాఖ్యానించింది. ఈ కేసులో దర్యాప్తునకు

2లో..

## 9 రోజుల్లోనే.. రూపురేఖలు మారిపోయాయ్

నిర్వహించిన సమావేశానికి పవన్ కళ్యాణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా స్కూల్లో అందుబాటులో ఉన్న గ్రంథాలయం, ల్యాబ్, పాఠశాల గదులను డిప్యూటీ సీఎం పరిశీలించారు. ఈ సమయంలోనే శారదా స్కూలు లైబ్రరీలో పుస్తకాలు తక్కువగా ఉండడాన్ని పవన్ కళ్యాణ్ గమనించారు. అనంతరం జరిగిన సమావేశంలో స్కూలు లైబ్రరీ నిండుగా పుస్తకాలు, 25 కంప్యూటర్లతో ల్యాబ్ ఏర్పాటు చేయిస్తానని పవన్ కళ్యాణ్ హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం, కేవలం తొమ్మిది రోజుల్లోనే తన హామీ నిలబెట్టుకున్నారు పవన్ కళ్యాణ్. శారద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కంప్యూటర్లతో అధునాతన స్కిల్ ల్యాబ్ ఏర్పాటు చేయించారు. పుస్తకాలతో గ్రంథాలయాన్ని నింపేశారు. పెద బాలశిక్ష నుంచి కాశీమజిలీ కథల వరకు పలు పుస్తకాలను అందుబాటులో ఉంచారు. అలాగే విద్యార్థుల కోసం స్పోకెన్ ఇంగ్లీష్, హిందీ, తమిళం, కన్నడ, ఒడియా వంటి భాషల పుస్తకాలను సమకూర్చారు. మొత్తం రూ. 25 లక్షల వరకూ ఖర్చు చేసి పవన్ కళ్యాణ్ వీటిని ఏర్పాటు చేయించారు. సోమవారం రోజున చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చేతుల మీదుగా కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీలను ప్రారంభించి విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చారు. మరోవైపు పాఠశాలల అభివృద్ధిపై పవన్ కళ్యాణ్ ప్రత్యేక దృష్టికి పెట్టారు. క్షేత్ర స్థాయి పర్యటనల సమయంలో పవన్ కళ్యాణ్ విద్యార్థులకు అందుబాటులో ఉన్న వసతులపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తుంటారు. వాటిని సమకూరుస్తుంటారు. గతంలో అన్నమయ్య జిల్లాలోని మైసూరవారిపల్లిలో పర్యటించినప్పుడు ఆ గ్రామంలోని పాఠశాలకు ఆట స్థలం లేదని తెలుసుకున్న పవన్ కళ్యాణ్ రూ. 65 లక్షల సొంత నిధులు వెచ్చించి గ్రౌండ్ ఏర్పాటు చేయించారు. కడప మున్సిపల్ స్కూల్ సందర్శించిన సమయంలో, అక్కడి పరిస్థితులను గమనించి మోడల్ కిచెన్ ఏర్పాటు చేయించారు.

## విస్తా "రణం"

అంచనాలో ఉన్నారు. కానీ హైకమాండ్ ఇంత వరకూ దీనిపై ఎలాంటి అనుమతి ఇవ్వలేదని తెలిసింది. కేసీ వేణుగోపాల్ తో చర్చించిన తర్వాత కూడా క్లారిటీ రానట్లే తెలిసింది. మరొకవైపు పంచాయతీ ఎన్నికల తర్వాత మాత్రం మంత్రి వర్గ విస్తరణ ఉంటుందన్న ప్రచారం బలంగా వినిపిస్తుండటంతో ఆశావహులు ఢిల్లీ బాట పట్టే అవకాశముంది. మరి మూడో దశ పంచాయతీ ఎన్నికలు ఈ నెల 17వ తేదీన జరగనున్నాయి. అయితే మంత్రి వర్గ విస్తరణ అనేది ఎప్పుడన్నది మాత్రం క్లారిటీ రాకపోవడానికి కారణం ఎవరు ఇన్.. ఎవరు అవుట్? అన్న దానిపై హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వకపోవడమే.

## దీదీపై బీజేపీ సంచలన పోస్టు

ముఖ్యమంత్రి మమతా బెనర్జీని లక్ష్యంగా చేసుకుని కొత్త వివాదానికి తెరలేపింది. బెంగాల్ బీజేపీ తన సోషల్ మీడియా పోస్ట్ లో మమతా బెనర్జీని "నియంత" గా అభివర్ణిస్తూ, అడాల్ఫ్ హిట్లర్ తో పోల్చింది. మమతా బెనర్జీ ముఖాన్ని హిట్లర్ ముఖంతో కలిపి, "ది డిక్టేటర్ ఇస్ రాట్ఇల్డ్" అనే క్యాప్షన్ జత చేసింది. ఈ పోస్టు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో.. బెంగాల్ రాష్ట్ర రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. దీదీని హిట్లర్ తో పోల్చడంపై తృణమూల్ కాంగ్రెస్ నాయకులు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. అటు బీజేపీ నేతలు కూడా దీదీపై కీలక ఆరోపణలు చేస్తూ కాలు దువ్వుతున్నారు. దీంతో కొన్ని నెలల ముందే బెంగాల్ లో ఎన్నికల వాతావరణం తారాస్థాయికి చేరినట్లుగా భావించవచ్చు. మరోవైపు బెంగాల్ లో ఎస్ఐఆర్ ప్రక్రియ కొనసాగుతోంది. తాజా సవరణల్లో భాగంగా ఓటర్ల జాబితా నుంచి 58 లక్షలకు పైగా ఓట్లను తొలగించేందుకు ఎన్నికల అధికారులు రంగం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఎన్నికల కమిషన్ ఆదివారం సాయంత్రం డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా ప్రచురణను ప్రారంభించినట్లు అధికారులు పేర్కొన్నారు. అలా సవరించిన ఎలక్టోరల్ రోల్స్ ను డిసెంబర్ 16 న ప్రజల ముందుకు తీసుకువస్తామని తెలిపారు.

# సర్పంచులను వేధిస్తే ఊరుకోం

"మిమ్మల్ని సస్పెండ్ చేస్తాం, ఇబ్బంది పెడతాం అని ఎవరైనా అధికారులు గానీ, పాలకపక్ష నేతలు గానీ బెదిరిస్తే ఒక్క క్షణం కూడా ఆలోచించకండి. వెంటనే పార్టీని సంప్రదించండి. మీ కోసం ప్రతి జిల్లాలో లీగల్ సెల్ ఏర్పాటు చేస్తున్నాం. అరగంటలో పార్టీ యంత్రాంగం మీకు అండగా నిలుస్తుంది, కోర్టు ద్వారా మన హక్కుల కోసం కొట్లాడుదాం" అని కేటీఆర్ స్పష్టం చేశారు. రాజ్యాంగబద్ధంగా గ్రామాలకు రావాల్సిన ఫైనాన్స్ కమిషన్ నిధులను ఎవరూ ఆపలేరని, ఆ నిధులు సాధించుకునే బాధ్యత తాము తీసుకుంటామని హామీ ఇచ్చారు.

### కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత

కేవలం రెండేళ్ల పాలనలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని కేటీఆర్ విమర్శించారు. రైతుబంధు, రుణమాఫీ, పెన్షన్లు, మహిళలకు తులం బంగారం వంటి హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో 40 నుండి 70 శాతం స్థానాల్లో బిఆర్ఎస్ మద్దతుదారులు గెలవడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. సూర్యాపేట జిల్లాలో మల్లయ్య యాదవ్ హత్య, తిప్పర్తిలో కిడ్నాప్ వంటి ఘటనలను ప్రస్తావిస్తూ కాంగ్రెస్ పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి పంచాయతీ ఎన్నికల్లో ప్రచారం చేసిన ప్రజల వ్యతిరేకత నుంచి కాంగ్రెస్‌ని కాపాడలేకపోయారని కేటీఆర్ అన్నారు.

### పదవి ముఖ్యం కాదు.. పనే ముఖ్యం

సర్పంచులు కేవలం పదవులను అలంకారప్రాయంగా కాకుండా, గ్రామ అభివృద్ధికి సాధనంగా వాడుకోవాలని కేటీఆర్ సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ పూర్తయిన వెంటనే, గెలిచిన సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలకు పంచాయతీరాజ్ చట్టం, విధులు, హక్కులపై అవగాహన కల్పించేందుకు నిపుణులతో ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహిస్తామని కేటీఆర్ వెల్లడించారు. మిగిలిన విడత ఎన్నికల్లోనూ పార్టీ శ్రేణులు కష్టపడి గులాబీ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. దేశ జనాభాలో కేవలం 3 శాతం ఉన్న తెలంగాణ, కేంద్రం ప్రకటించిన ఉత్తమ పంచాయతీ అవార్డుల్లో 30 శాతం కైవసం చేసుకుందని, ఇది కేసీఆర్ పాలన దక్షతకు నిదర్శనమని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ రికార్డును దేశంలో ఏ రాష్ట్రం కూడా సాధించలేదని అన్నారు.

## పొట్టిశ్రీరాములు యావత్ తెలుగు ప్రజల ఆస్తి

కోసం, ఆ తర్వాత తెలుగు వారి ఆత్మగౌరవం కోసం పోరాడిన మహనీయుడు పొట్టిశ్రీరాములు. పాలకుల వివక్షకు గురైన తెలుగు జాతికి ప్రత్యేక రాష్ట్రం కోసం 58 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించారు.

ఆయన కృషితోనే 1953 అక్టోబరు 1న కర్నూలు రాజధానిగా ఆంధ్ర రాష్ట్రం, 1956 నవంబరు 1న ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డాయి. కొందరు ఈ తేదీలపై అనవసర రాజకీయం చేస్తున్నందునే, ఆయన ఆత్మార్పణ చేసిన రోజునే త్యాగాలకు గుర్తుగా నిర్వహించాలని నిర్ణయించాం" అని స్పష్టం చేశారు. పొట్టిశ్రీరాములు ఒక కులానికి చెందిన వ్యక్తి కాదని, యావత్ తెలుగు ప్రజల ఆస్తి, గుండె చప్పుడు అని కొనియాడారు. పొట్టిశ్రీరాములు స్ఫూర్తిని భావితరాలకు అందించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని చంద్రబాబు తెలిపారు. అమరావతిలో స్మృతి వనంతో పాటు, చెన్నైలో ఆయన తుదిశ్వాస విడిచిన భవనాన్ని, నెల్లూరులోని నివాసాన్ని మెమోరియల్స్‌గా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. ఎన్టీఆర్ గతంలో తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టిశ్రీరాములు పేరు పెట్టారని, తాను కూడా నెల్లూరు జిల్లాకు పొట్టిశ్రీరాములు పేరు పెట్టానని గుర్తుచేశారు.

### మహా కుట్ర చేశారు

గత వైసీపీ ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. "మూడు రాజధానుల పేరుతో మహా కుట్ర పన్నారు. అసలు రాజధానే లేకుండా చేసి ప్రపంచం ముందు రాష్ట్రాన్ని అపహాస్యం చేశారు. కనీసం రాజధాని పేరు చెప్పుకోలేని దుస్థితి కల్పించారు. కానీ ఇప్పుడు మన రాజధాని అమరావతి అని గర్వంగా చెప్పుకుంటున్నాం" అని అన్నారు. వ్యవసాయంతో పాటు పారిశ్రామిక అభివృద్ధికి కృషి చేస్తున్నామని, 18 నెలల్లోనే రూ.21 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించామని తెలిపారు.

పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీల ఏర్పాటుపై వస్తున్న విమర్శలను ఆయన తిప్పికొట్టారు. ఈ విధానం వల్లే రహదారులు, విమానాశ్రయాలు అభివృద్ధి చెందాయని, ఇది పార్లమెంటరీ కమిటీ కూడా సమర్థించిన ఉత్తమ విధానమని అన్నారు. కాలేజీలు ప్రభుత్వ అజమాయిషీలోనే ఉంటాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ మండలం పేరును 'వాసవీ పెనుగొండ'గా మారుస్తూ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు. దీంతో ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు, మహిళలు ప్లకార్డులు ప్రదర్శించి ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యమిస్తూ, తెలుగు జాతిని దేశంలోనే అగ్రస్థానంలో నిలపడమే ఎన్డీఏ కూటమి లక్ష్యమని చంద్రబాబు పునరుద్ఘాటించారు.

# కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో లోకేశ్ భేటీ

కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న పలు కీలక నిర్ణయాలను లోకేశ్ ఈ సందర్భంగా కేంద్ర మంత్రికి వివరించారు. ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థుల్లో పఠన, గణన నైపుణ్యాలు పెంచేందుకు 'గ్యారెంటీడ్ ఎఫ్ఎల్ఎన్' కార్యక్రమం, అభ్యసన సామర్థ్యాల కోసం క్లిక్కర్ ఆధారిత ఇంటరాక్టివ్ క్లాస్‌రూమ్‌లు ప్రవేశపెట్టామని తెలిపారు. విద్యార్థులకు రాజ్యాంగంపై అవగాహన కల్పించేందుకు 'ఆంధ్రప్రదేశ్ పాఠశాల శాసనసభ' పేరుతో మాక్ అసెంబ్లీ నిర్వహిస్తున్నామని, బాలల భారత రాజ్యాంగాన్ని పుస్తక రూపంలో తీసుకొచ్చామని వివరించారు. దేశంలోనే తొలిసారిగా కడపలో ఏర్పాటు చేసిన సెంట్రల్ స్మార్ట్ కిచెన్ గురించి కూడా ప్రస్తావించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమాలను కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అభినందించారు. అనంతరం, రాష్ట్రానికి కేంద్రం నుంచి అందాల్సిన సహకారంపై మంత్రి లోకేశ్ పలు విజ్ఞప్తులు చేశారు. రాష్ట్రానికి ప్రతిపాదించిన 11 జవహర్ నవోదయ విద్యాలయాలను (జెఎన్వీ) వెంటనే మంజూరు చేయాలని కోరారు. అలాగే, ఇప్పటికే కేటాయించిన 12 కేంద్రీయ విద్యాలయాల (కెవీ) ఏర్పాటును వేగవంతం చేయాలన్నారు. సమగ్ర శిక్ష సంస్కరణల్లో భాగంగా స్టార్స్ ప్రాజెక్ట్ కింద రాష్ట్రానికి రూ.4,400 కోట్ల ఆర్థిక సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన రూ.1,270 కోట్ల అదనపు నిధులకు ఆమోదం తెలపాలని, పీఎం పోషణ్ పథకం కింద పైలట్ ప్రాజెక్టుగా 155 స్మార్ట్ కిచెన్ల ఏర్పాటుకు అనుమతించాలని కోరారు. ఈ సందర్భంగా, గుంటూరు జిల్లా చినకాకానిలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో అభివృద్ధి చేసిన మోడల్ ఆటిజం సపోర్ట్ సెంటర్‌ను ప్రారంభించాలని లోకేశ్.. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను ఆహ్వానించారు.

## 2029 ఎన్నికల్లో పోటీ చేస్తాం

కవిత ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో "మీ కొత్త పార్టీ పేరు ఏంటి?" అని ఓ నెటిజన్ అడగగా ఆ పేరు ఎలా ఉండాలో చెప్పాలంటూ కవిత బదులిచ్చారు. కాగా, భారత్ వందో స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకునే 2047 నాటికి మీ విజన్, మిషన్ ఏంటి అని నెటిజన్ అడిగాడు. దీనికి బదులిస్తూ నాణ్యమైన ఉచిత విద్య, నాణ్యమైన ఉచిత వైద్యం అందించడమే తన విజన్, తన మిషన్ అని కవిత పేర్కొన్నారు. ఇక తెలంగాణ జాగృతి కార్యక్రమాలు నగరాలకే ఎందుకు పరిమితమయ్యాయని అడిగిన ప్రశ్నకు త్వరలో జాగృతిని గ్రామాలకు విస్తరిస్తానని కల్వకుంట్ల కవిత చెప్పారు. ప్రతి గ్రామంలో కమిటీలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. తమిళనాడులో జయలలిత ఎలా స్వతంత్ర నాయకత్వంతో ప్రజల విశ్వాసం సంపాదించారో, అలాగే మీరు కూడా ముఖ్యమంత్రి అయితే ప్రజలకు అంకితమైన బలమైన నాయకత్వం అందిస్తారని ఆశిస్తున్నామని అన్న ఓ నెటిజన్ పోస్టుకు సానుకూలంగా స్పందించారు కవిత. అంతేకాకుండా ఇటీవల 'నాకు కూడా టైం వస్తుంది, నేను కూడా ఏదో ఒక రోజు ముఖ్యమంత్రి అవుతాను' అంటూ కవిత ధీమా వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. దీంతో 2029లో కవిత సీఎం అభ్యర్థిగా బరిలోకి దిగుతున్నారంటూ జోరుగా ప్రచారం జరుగుతోంది.

## దేవుడికి విశ్రాంతి వేళలు ఉంటాయి

ఉన్నతస్థాయి ఆలయ నిర్వహణ కమిటీని నియమించింది. బాంకీ బీహారీజీ ఆలయంలో దర్శన వేళల్లోనే కాకుండా పలు మతపరమైన పూజా విధానాల్లోనూ మార్పులు చేస్తున్నట్లు పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది శ్యామ్ దివాన్, న్యాయవాది తన్వి దూబే అత్యున్నత న్యాయస్థానానికి తెలిపారు. ఏళ్లుగా వస్తున్న సంప్రదాయం ప్రకారం దేవుడికి విశ్రాంతి వేళలు ఉంటాయని, కానీ ఆ సమయంలోనూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఆలయ కమిటీపై ఆగ్రహం వ్యక్తం చేసింది. దేవుడికి విశ్రాంతినివ్వకుండా ప్రత్యేక పూజలు చేయడమేమిటని ప్రశ్నించింది. అనాదిగా వస్తున్న నియమాలను, పద్ధతులను, దర్శన సమయాలను పాటించాలని ఆదేశించింది. అనంతరం కేసు విచారణను జనవరి మొదటి వారానికి వాయిదా వేసింది.

## రవీంద్రభారతిలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కాంస్య విగ్రహావిష్కరణ

తెలిపారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ, బాలసుబ్రహ్మణ్యం కేవలం స్వర సార్వభౌముడు మాత్రమే కాదని, ఆయన గొప్ప సంస్కారవంతుడని, నిరాడంబరుడని కొనియాడారు. ఆయన గాత్రంలో నవరసాలు నాట్యం చేసేవని, ఆయన ఆలపించిన ప్రతీ పాట భావ జలపాతమని అభివర్ణించారు

"సంగీత దర్శకులు, గేయ రచయితలు ఏది కోరుకుంటే అది పలికించే ఒక అక్షయపాత్ర ఆయన గళం. ఎంతో మంది నటుల నటనా శైలికి, వారి హావభావాలకు అనుగుణంగా గాత్రధర్మాన్ని మార్చుకుని పాడటం ఆయనకు మాత్రమే సాధ్యమైంది" అని ప్రశంసించారు. బాలు కేవలం గాయకుడిగానే కాకుండా, డబ్బింగ్ కళాకారుడిగా, నటుడిగా, మార్గదర్శిగా తన బహుముఖ ప్రజ్ఞను ప్రదర్శించారని వెంకయ్యనాయుడు గుర్తుచేశారు. ఆయనలో ఒక గొప్ప వ్యక్తిత్వ వికాస నిపుణుడు ఉన్నారని, 'పాడుతా తీయగా' వంటి కార్యక్రమాల్లో చిన్నారులను ఆయన ప్రోత్సహించిన తీరు అద్భుతమని కొనియాడారు. కేవలం సంగీత పాఠాలే కాకుండా, వారికి జీవిత సత్యాలను బోధిస్తూ, వారిలో సంస్కార బీజాలు నాటేందుకు ప్రయత్నించారని వివరించారు. చిన్నారులకు ఆయన చూపిన మార్గదర్శనం, పెద్దల పట్ల ఆయన చూపిన గౌరవం నేటి తరానికి ఆదర్శనీయమని వెంకయ్యనాయుడు అన్నారు. ఎస్పీబీ భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన పాటల రూపంలో చిరస్థాయిగా నిలిచి ఉంటారని పేర్కొన్నారు. మన భాషా సంస్కృతులను పరిరక్షించుకోవడమే మనం ఎస్పీబీకి ఇచ్చే నిజమైన, సార్థకమైన నివాళి అవుతుందని ఆయన పిలుపునిచ్చారు. ఈ గొప్ప కార్యక్రమాన్ని నిర్వహించిన తెలంగాణ ప్రభుత్వ సాంస్కృతిక శాఖను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

# జీహెచ్ఎంసీ డివిజన్ల పెంపుపై అభ్యంతరాలు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ప్రభుత్వం ఇటీవల హైదరాబాద్ నగర పరిపాలనలో కీలక సంస్కరణలు చేపట్టిన విషయం తెలిసిందే. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధిని విస్తరిస్తూ నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగా భవిష్యత్తులో జనాభా పెరుగుదలను దృష్టిలో ఉంచుకుని వార్డుల సంఖ్యను ప్రస్తుతం ఉన్న 150 నుంచి ఏకంగా 300కు పెంచుతూ అధికారిక ఉత్తర్వులు ఇచ్చింది. ఈ మేరకు డిసెంబర్ 8న గెజిట్ నోటిఫికేషన్‌ను కూడా విడుదల చేసింది. ఈ నేపథ్యంలో జీహెచ్ఎంసీ పరిధిలో డివిజన్ల సంఖ్య పెంపును సవాల్ చేస్తూ.. వినయ్‌కుమార్ అనే వ్యక్తి సోమవారం (డిసెంబర్ 15) తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. డివిజన్ల పునర్విభజన సమయంలో ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాలను ప్రభుత్వం పట్టించుకోలేదని పిటిషన్‌లో ఆరోపించారు. ఈ విషయాన్ని అత్యవసరంగా విచారించాలని హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు.

### విభజన ఏకపక్షంగా జరిగింది..

డివిజన్ల పునర్విభజనలో అభ్యంతరాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదని పిటిషనర్ పేర్కొన్నారు. వార్డుల పునర్విభజన అసంబద్ధంగా, ఏకపక్షంగా జరిగిందని ఆరోపించారు. భౌగోళిక సౌలభ్యం, జనాభా, పరిపాలనా సమతుల్యతను పక్కనపెట్టి, వార్డుల డీలిమిటేషన్ చేశారని పిటిషన్‌లో ఆరోపించారు. అయితే కొన్ని ప్రాంతాలకు అన్యాయం జరిగేలా మరికొన్ని ప్రాంతాలకు లాభం చేకూర్చేలా వార్డుల విభజన చేశారని ఆరోపణ గుప్పించారు. ప్రజాప్రతినిధులు, ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోలేదన్నారు.

మరోవైపు, రాంనగర్ డివిజన్‌పై తన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకునేలా ఆదేశాలు జారీ చేయాలని పిటిషనర్ కోరారు. వినయ్‌కుమార్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ బి విజయ్‌సేన్ రెడ్డి నేతృత్వంలోని ధర్మాసనం విచారణకు స్వీకరించడం గమనార్హం. ఈ పిటిషన్‌పై విచారణను డిసెంబర్ 16కు వాయిదా వేసింది హైకోర్టు. ఇటీవల నగర శివారు 27 మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో విలీనం చేసిన సర్కార్, వార్డుల సంఖ్యను 150 నుంచి 300కు పెంచింది. డివిజన్ల క్రమం హైదరాబాద్ ఈశాన్యంలోని దమ్మాయిగూడ మున్సిపాలిటీ నుంచి మొదలవుతుంది. దమ్మాయిగూడ జనాభా లక్ష వరకు ఉన్నందున.. దాన్ని రెండు డివిజన్లుగా విభజించారు. గ్రేటర్‌లో విలీనమైన మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు కనీసం రెండు డివిజన్లుగా మారనున్నాయి. కాగా, వార్డుల సంఖ్య పెంపుతో సులభంగా పాలన జరుగుతుందని రేవంత్ రెడ్డి ప్రభుత్వం భావిస్తోంది. విభజన ద్వారా వార్డు పరిధి చిన్నదవుతుంది.

దీంతో కార్పొరేటర్లు తమ వార్డులోని సమస్యలను సులభంగా తెలుసుకుని పరిష్కరించే అవకాశం ఏర్పడుతుంది. కాగా, వార్డుల డీలిమిటేషన్ ద్వారా రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో 300 మంది కార్పొరేటర్లు ఎన్నికవుతారు. ప్రతి కార్పొరేటర్ తమ వార్డు అభివృద్ధిపై పూర్తి దృష్టి సారించి నీరు, రోడ్లు, పారిశుద్ధ్యం వంటి ప్రాథమిక వసతుల విషయంలో మెరుగైన సేవలు అందించే అవకాశం ఉంటుంది.

## వేములవాడ ఆలయ ప్రాంగణంలో మళ్ళీ పాము కలకలం

వేములవాడ, : రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ దేవస్థానంలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఆలయ ప్రాంగణంలో, ముఖ్యంగా పార్వతిపురం వసతిగృహాలలో భక్తులు బస చేస్తుంటారు. వారం రోజుల క్రితం ఆలయ ప్రాంగణంలో పాము కనిపించగా, తాజాగా పార్వతీపురం వసతిగృహంలో మరో నాగుపాము కలకలం సృష్టించింది. సిబ్బంది శుభ్రం చేస్తుండగా పాము బుసలు కొట్టడంతో భక్తులు భయంతో పరుగులు తీశారు. స్నేక్ క్యాచర్ జగదీష్ వచ్చి పామును పట్టుకున్నాడు.

## ఇసుక రవాణా.. రక్షణ చర్యలు సున్నా

సిరిసిల్ల, : , సుల్తానాబాద్ గ్రామీణం: మానేరు వాగు నుంచి ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ల యజమానులు ఎలాంటి జాగ్రత్తలు పాటించడం లేదు. వాగులో ఇసుక లోడింగ్ చేసిన తర్వాత ట్రాక్టర్‌పై పరదాలు కప్పాలనే నిబంధన ఉంది. దీని ద్వారా ఇసుక రవాణా చేసే క్రమంలో ట్రాక్టర్ వెనుక వస్తున్న ద్విచక్రవాహనదారుడి కళ్లకు ఎలాంటి హాని కలగదని అధికారులు భావించి గతంలో గట్టి నిబంధన విధించారు. కానీ ట్రాక్టర్ల యజమానులు అలాంటి రక్షణ చర్యలేవీ పాటించడం లేదు.

# రాగి తీగపై దొంగల కన్ను

ధర్మపురి, : అసలే ఎత్తిపోతల నిర్వహణ భారంతో రైతులు ఇబ్బందులు పడుతుంటే నియంత్రికలను ధ్వంసం చేసి రాగి తీగను దొంగలు ఎత్తుకుపోవడంతో సాగుకు ఇబ్బందితోపాటు మరమ్మతుల కోసం రూ.లక్షలు ఖర్చవుతున్నాయని రైతులు వాపోతున్నారు. వరుస చోరీలతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారం రోజుల వ్యవధిలో జైన, దమ్మన్నపేట, రాయపట్నం ఎత్తిపోతల వద్ద రాగితీగ చోరీకి గురికావడం విస్మయానికి గురి చేస్తోంది. వాస్తవానికి నిర్వహణ భారమంతా స్థానికంగా ఉన్న కమిటీ చూసుకోవాల్సి ఉంటోంది. కానీ మరమ్మతుల కోసం రూ.లక్షలు అవసరం కానుండటంతో ప్రభుత్వం భరించాలని రైతులు అభిప్రాయపడుతున్నారు.

## తెలంగాణ ఆయిల్ పామ్ సాగులో దేశానికి హబ్:

ఖమ్మం, : తెలంగాణ వ్యాప్తంగా పది లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు జరుగుతోందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఆయన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలోని పామాయిల్ ఫ్యాక్టరీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అన్నదాతలు ఆత్మగౌరవంతో, ఆరోగ్యంగా ఉండేది వ్యవసాయ రంగం మాత్రమేనని, రానున్న రోజుల్లో రైతులకు మంచి భవిష్యత్ ఉందని ఆయన ఉద్ఘాటించారు. ఆయిల్ పామ్ సాగులో తెలంగాణ దేశానికి హబ్‌గా మారనుందని మంత్రి పేర్కొన్నారు.

# ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడి విజయం

మధిర, : ప్రభుత్వానికి వ్యతిరేకంగా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు చేస్తుండటంతో అధికార పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు తనను వేధింపులకు గురిచేస్తున్నారంటూ గతంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు పంచాయతీ ఎన్నికల్లో సర్పంచిగా విజయం సాధించారు. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం సుద్దవాగుతండాకు చెందిన బానోత్ రవి(ఆర్మీ రవి) భారాస నాయకుడు. సామాజిక మాధ్యమాల్లో చురుగ్గా ఉండే ఇతను రెండు నెలల క్రితం బలవన్మరణానికి యత్నించాడు. అనంతరం కోలుకున్నాడు. తాజాగా రెండో దశ పంచాయతీ ఎన్నికల్లో భారాస బలపరిచిన అభ్యర్థిగా పోటీచేసి 134 ఓట్ల ఆధిక్యంతో కాంగ్రెస్ అభ్యర్థిపై విజయం సాధించారు.

# సంక్రాంతికి ప్రత్యేక రైలు సర్వీసులు

వైరా, : పెద్ద పండుగలో ఒకటైన సంక్రాంతికి రైల్వే ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని దక్షిణ మధ్య రైల్వే అధికారులు ప్రత్యేక రైలు సర్వీసులను ప్రకటించింది.

ఈ నేపథ్యంలో ఖమ్మం రైల్వేస్టేషన్ మీదుగా వెళ్లేలా ఐదు ప్రత్యేక రైళ్లను కేటాయించగా.. మొత్తం 10 సర్వీసులను నడపనున్నారు. 2026, జనవరి 9 నుంచి 20వ తేదీ వరకు ఈ ప్రత్యేక రైళ్ల రాకపోకలు కొనసాగుతాయని ఖమ్మం రైల్వేస్టేషన్ చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ డి.రాజగోపాల్ తెలిపారు. వీటికి రిజర్వేషన్ సౌకర్యం ప్రారంభించారని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు..

# వణికిస్తున్న చలి

పాలేరు, : ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో చలి కొరికేత్తాంది. రాత్రీపగలు తేడా లేకుండా శీతల గాలులు వీస్తున్నాయి. భద్రాద్రి ఏజెన్సీ ప్రాంతాలు సహా ఖమ్మంలోని మైదాన ప్రాంతం వరకు అన్ని మండలాల్లో చలి తీవ్రతకు జనం అల్లాడిపోతున్నారు. వృద్ధులు, పిల్లలు, మహిళలు వణికిపోతున్నారు. ఇంట్లో ఉన్నా తట్టుకోలేకపోతున్నామంటూ ఎండలో ఎక్కువ సమయం గడుపుతున్నారు. ఆటోమేటిక్ వెదర్ స్టేషన్లలో నమోదైన రాత్రివేళ కనిష్ఠ ఉష్ణోగ్రతలు ఇలా ఉన్నాయి..

## కబడ్డీలో రాణించిన గుంజేడు యువకుడు

మహబూబాబాద్, : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖపట్నంలో ఈ నెల 24న జరగనున్న నేషనల్ ట్రైబల్ సీనియర్ మీట్ కబడ్డీ టోర్నమెంట్‌కు తెలంగాణ రాష్ట్రం మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం గుంజేడు గ్రామానికి చెందిన తోలేం సూర్య ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, ఆదివాసీ సంఘాల నాయకులు సూర్యను అభినందించి, కబడ్డీలో జాతీయ స్థాయిలో గుర్తింపు తేవాలని ఆకాంక్షించారు..

## కూతురు సర్పంచ్, తండ్రి ఉప సర్పంచ్

జనగామ, : జనగామ మండలం వెంకిర్యాల పంచాయతీ ఎన్నికల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. సర్పంచ్ గా బీజేపీ బలపరిచిన గొల్లపల్లి అలేఖ్య గెలుపొందగా, ఉప సర్పంచ్ గా ఆమె తండ్రి గొల్లపల్లి పర్షయ్య ఎన్నికయ్యారు. ఉప సర్పంచ్ ఎన్నికలో వార్డు సభ్యులు బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులకు సమానంగా మద్దతు తెలపడంతో, కూతురు అలేఖ్య తన తండ్రి (బీఆర్ఎస్ మద్దతుదారు)కి మద్దతు తెలిపి గెలిపించారు.

## ఓటు హక్కు విలువపై రాజుపేటలో మహిళా సంఘాల అవగాహన ర్యాలీ



నర్సంపేట, : నర్సంపేట మండలం రాజుపేట గ్రామంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఓటు హక్కు విలువపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. 'ఓటు అమ్ముకునే వస్తువు కాదు, ప్రజాస్వామ్యానికి ప్రాణం' అనే నినాదాలతో గ్రామ వీధుల్లో ర్యాలీ చేపట్టారు. డబ్బు, మద్యం వంటి ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛాయుతంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ప్రజలను మహిళలు కోరారు. ఈ ర్యాలీ ద్వారా ఓటు ప్రాముఖ్యతను, బాధ్యతాయుతమైన ఓటింగ్ ఆవశ్యకతను ప్రజలకు తెలియజేశారు.

# ఓసిఎం-1 సిహెచ్పీలో రక్షణ పక్షోత్సవాలు.

## -అలరించిన లఘునాటిక
## -సింగరేణి కళాకారుడు రాధాకృష్ణకు సన్మానం




**గోదావరిఖని** సింగరేణి 56వ రక్షణ పక్షోత్సవాలలో భాగంగా ఈ అండ్ ఎం అడిషనల్ జీఎం జి.కృష్ణమూర్తి నేతృత్వంలోని రక్షణ కమిటీ బృందం సోమవారం ఆర్జీ–3 ఏరియా ఓసిఎం–1 సిహెచ్పీ ని సందర్శించింది. ఈ సందర్భంగా గనిపై ఏర్పాటు చేసిన సమావేశానికి ఓసిఎం–1 ప్రాజెక్ట్ అధికారి ప్రవీణ్ వి ఫాటింగ్, ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ఓసిఎం–1 సిహెచ్పీ అత్యుత్తమ ప్రమాణాలను పాటిస్తూ, గణనీయమైన స్థాయిలో డిస్పాచ్ చేస్తూ రికార్డ్ సృష్టించిందన్నారు. రక్షణ కమిటీ బృంద కన్వీనర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ ఈ సిహెచ్పీ కార్మికులు గత కొన్ని సంవత్సరాలుగా అన్ని విభాగాలలో ఉత్తమ నైపుణ్యం కనపరుస్తున్నారని, ఇదే సంస్కృతిని కొనసాగిస్తూ రక్షణతో పని చేయాలని సూచించారు. అనంతరం గని కార్మికులు రాధాకృష్ణ, రమేష్, రాజు, జగదీశ్, చంద్రపాల్ బృందం ప్రదర్శించిన లఘు నాటిక 'మన రక్షణ–మన బాధ్యత' ఆహుతులను ఆకట్టుకోగా, మహిళా కార్మికురాళ్ళు సివిఆర్ చేయవలసిన విధానాన్ని ప్రదర్శించారు. కాగా ఈ సిహెచ్పీ లో విధులు నిర్వహిస్తూ త్వరలో ఉద్యోగ విరమణ చేయనున్న సింగరేణి కళాకారుడు కొండ్ర రాధాకృష్ణను కళాకారులు, అధికారుల పక్షాన ఘనంగా సన్మానించారు. ఇంకా ఈ కార్యక్రమంలో సిహెచ్పీ ఉన్నతాధికారి కాశీ విశ్వేశ్వర్ రావు, అధికారులు ఉదయ్ భాస్కర్, గని మేనేజర్ పాపయ్య, రక్షణాధికారి అజయ్ కుమార్, శ్రీనివాస్ తోపాటు అధికారులు, కార్మిక సంఘాల నాయకులు మురళీ కృష్ణ, డి.తిరుపతిరావు, జి.తిరుపతి, గంధం శ్రీనివాస్, కిషన్ నాయక్, సాయి స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 20న అయ్యప్ప స్వామి తెప్పోత్సవం

**కరీంనగర్** డి. సంపత్ తెప్పోత్సవ కమిటీ చైర్మన్ ఆధ్వర్యంలో గత 15 సంవత్సరాలుగా భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న అయ్యప్ప స్వామి తెప్పోత్సవ కార్యక్రమం ఈ ఏడాది కూడా ఈనెల 20న ఘనంగా నిర్వహించనున్నట్లు కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం నుంచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరగనున్నాయని పేర్కొన్నారు. తెప్పోత్సవ దినాన మధ్యాహ్నం 1 గంటలకు అయ్యప్ప స్వాములకు మరియు భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే రాత్రి 9:15 గంటలకు భక్తులకు అల్పాహారం అందించనున్నట్లు వెల్లడించారు. అయ్యప్ప స్వాములు, భక్తులు కుటుంబ సమేతంగా హాజరై స్వామి తీర్థ ప్రసాదాలు స్వీకరించి అయ్యప్ప స్వామి కృపకు పాత్రులు కావాలని కమిటీ చైర్మన్ డి. సంపత్ పిలుపునిచ్చారు. ఈ తెప్పోత్సవంలో ప్రత్యేక ఆకర్షణగా సాయంత్రం 7:15 గంటలకు గోమాతతో కలిసి అయ్యప్ప స్వామి దేవాలయం చుట్టూ ప్రదక్షిణ నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం గోమాతకు అయ్యప్ప స్వాములు మహిళలు కలిసి మహారతి ఇవ్వనున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం భక్తుల్లో విశేష ఉత్సాహాన్ని నింపుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డి. సంపత్ తెప్పోత్సవ కమిటీ చైర్మన్‌తో పాటు పాదయాత్ర గురుస్వామి గడప నాగరాజు, రుద్రాక్ష కృష్ణ గురుస్వామి, బండారి శ్రావణ్, శ్రీకర్ స్వామి, అనిల్ స్వామి, రంజిత్ స్వామి, రఘురాం రెడ్డి స్వామి, రోమాల రమేష్ గురుస్వామి, రాహుల్ స్వామి, కార్తీక్ స్వామి, బొల్లు నరేందర్ స్వామి, దిలీప్ స్వామి, జీఎస్ ఆనంద్ స్వామి, పల్లె నారాయణ గురు స్వామి తదితరులు పాల్గొన్నారు.

## తప్పుల తడకగా డివిజన్ల పునర్విభజన

**సికింద్రాబాద్..** డివిజన్ల పునర్విభజన తప్పుల తడకగా ఉన్నదని మాజీ మంత్రి సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆరోపించారు. సికింద్రాబాద్ వెస్ట్ మారేడ్ పల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో తలసాని సనత్ నగర్ నియోజకవర్గ ముఖ్య నాయకులతో డీ లిమిటేషన్ సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిదులను కానీ సంప్రదించకుండా ఆఫీస్ లో కూర్చొని ల్యాప్ టాప్ పెట్టుకొని గూగుల్ మ్యాప్ ద్వారా డీ లిమిటేషన్ చేసారని తెలిపారు. కనీస పరిజ్ఞానం లేకుండా సమస్యల తడకగా పునర్విభజన జరిగిందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వమే గందరగోళంలో ఉందని, పరిపాలన చేయమంటే ముఖ్యమంత్రి పోయి ఫుట్బాల్ ఆడుతున్నాడని హేళన చేశారు.

## క్రిస్మస్ వేడుకలకు హాజరయిన ఎమ్మెల్యే

**సికింద్రాబాద్** కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ సోమవారం నియోజకవర్గ పరిధిలోని వార్డు 6 కాంటా బస్తీ లోని పుదు వాల్యు చర్చ్, వార్డు 2 రసూల్ పుర లోని హెవెన్ ప్యాలెస్ లలో నిర్వహించిన క్రిస్మస్ సెలబ్రేషన్స్ కు నిర్వాహకుల ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు . అనంతరం వేడుకలను ఉద్దేశించి ఎమ్మెల్యే శ్రీగణేష్ గారు మాట్లాడుతూ లోక రక్షకుడు ఏసుక్రీస్తు మార్గాన్ని అనుసరించి ప్రజలందరూ సేవ, త్యాగం, క్షమ, ప్రేమల గుణాలను కలిగి శాంతి, సౌభ్రాతృత్వలతో నడవాలని అన్నారు. ఇలాంటి మంచి కార్యక్రమాలను నిర్వహించిన పాస్టర్ లను, నిర్వాహకులను ఎమ్మెల్యే గారు అభినందించి అందరికీ ముందస్తు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఏపీ ప్రభుత్వ 'చాయ్‌రస్తా' పథకం

**విజయనగరం :** ఏపీలో మహిళల ఆర్థిక స్వావలంబన దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. స్వయం ఉపాధిని ప్రోత్సహించే లక్ష్యంతో 'చాయ్‌రస్తా' పేరుతో సరికొత్త ఫ్రాంచైజ్ యూనిట్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ పథకం ద్వారా మహిళలకు స్థిరమైన ఆదాయం కల్పించి, వారిని వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ పథకం కింద తొలిదశలో 46 యూనిట్లను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రస్తుతం ప్రయోగాత్మకంగా విజయనగరం, రాజాం, బొబ్బిలి, నెల్లిమర్ల పట్టణాల్లో ఆసక్తి గల మహిళల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

ఒక్కో 'చాయ్‌రస్తా' యూనిట్ ఏర్పాటుకు సుమారు రూ.6.60 లక్షలు, ముడిసరుకు కోసం మరో రూ.50,000 అవసరమవుతుంది. ఈ పెట్టుబడి కోసం అర్హులైన మహిళలకు బ్యాంకుల నుంచి సులభంగా రుణాలు ఇప్పించే బాధ్యతను పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) తీసుకుంటుంది. ఈ అవుట్‌లెట్లలో గ్యాస్ అవసరం లేని ఆధునిక యంత్రాలను ఏర్పాటు చేస్తారు. కేవలం బటన్ నొక్కితే టీ, కాఫీ, బూస్ట్, హార్లిక్స్ వంటివి క్షణాల్లో సిద్ధమవుతాయి. వీటిని రూ.20 నుంచి రూ.30 మధ్య సరసమైన ధరలకు విక్రయిస్తారు. ఎంపికైన మహిళలకు గుంటూరు, విజయవాడలలో మూడు రోజుల పాటు ప్రత్యేక శిక్షణ ఇస్తారు. శిక్షణ పూర్తయ్యాక, నలుగురు మహిళలు కలిసి ఒక యూనిట్‌ను నిర్వహిస్తారు. బస్టాండ్లు, ఆసుపత్రులు, ప్రభుత్వ కార్యాలయాలు, మార్కెట్లు వంటి రద్దీ ప్రాంతాల్లో 80 నుంచి 100 అడుగుల స్థలంలో కంటైనర్ స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తారు. 18 నుంచి 55 ఏళ్ల మధ్య వయసున్న మహిళలు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చని, మెప్మా ద్వారా నిరంతర పర్యవేక్షణ, సహకారం ఉంటాయని అధికారులు తెలిపారు. తక్కువ పెట్టుబడితో స్వయం ఉపాధి పొందాలనుకునే మహిళలకు ఇది ఒక మంచి అవకాశమని వారు సూచిస్తున్నారు.

## బీఎల్వోల నుంచి మినహాయింపు ఇవ్వండి

**విజయవాడ,** గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను ఎన్నికల బూత్ స్థాయి అధికారి (బీఎల్‌వో) విధుల నుంచి తప్పించాలని సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. ఈ మేరకు ఆయన సీఎం చంద్రబాబుకు ఒక లేఖ రాశారు. సచివాలయ ఉద్యోగులు అదనపు పనిభారంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సచివాలయ ఉద్యోగులు ఇప్పటికే 16 రకాల సర్వేలతో పాటు ఇతర పనులతో తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నారని ఈశ్వరయ్య తన లేఖలో పేర్కొన్నారు.

ఈ పని భారానికి అదనంగా ఎన్నికల విధులు కూడా తోడవడంతో వారు తీవ్ర అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండు నెలల్లోనే పని ఒత్తిడి కారణంగా నలుగురు సచివాలయ ఉద్యోగులు మరణించడం అత్యంత బాధాకరమని ఆయన తెలిపారు. ఇదే సమయంలో కర్నూలు జిల్లాలో 600 మందికి పైగా సచివాలయ ఉద్యోగులకు అధికారులు షోకాజు నోటీసులు జారీ చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. ఇది దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. వెంటనే ప్రభుత్వం స్పందించి సచివాలయ ఉద్యోగులపై పని భారం తగ్గించాలని, వారిని బీఎల్‌వో విధుల నుంచి మినహాయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఈశ్వరయ్య విజ్ఞప్తి చేశారు.

# వైజాగ్‌కు వరల్డ్ చాంపియన్స్

**న్యూఢిల్లీ,** ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సోషల్ మీడియాలో చేసిన ఒక పోస్ట్ ఇప్పుడు సర్వత్రా ఆసక్తిని రేకెత్తిస్తోంది. ప్రస్తుతం ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన, త్వరలో విశాఖపట్నానికి ప్రపంచ ఛాంపియన్లు రాబోతున్నారని వెల్లడించారు. ఈ ప్రకటనతో రాష్ట్రవ్యాప్తంగా, ముఖ్యంగా వైజాగ్ ప్రజల్లో తీవ్ర కుతూహలం నెలకొంది."వైజాగ్... సిద్ధంగా ఉండు. ఈ నెలలోనే ప్రపంచ ఛాంపియన్లు వస్తున్నారు. వారెవరో ఎవరైనా ఊహించగలరా?" అంటూ లోకేశ్ తన సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ చేశారు. ఈ చిన్న పోస్ట్ ఇప్పుడు పెద్ద చర్చకు దారితీసింది. వస్తున్నది క్రీడా రంగానికి చెందినవారా, లేక టెక్నాలజీ లేదా వ్యాపార రంగంలోని దిగ్గజాలా అనే దానిపై ఊహాగానాలు మొదలయ్యాయి. సాధారణంగా ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి పనుల గురించి వెల్లడించే లోకేశ్, ఇలా సస్పెన్స్ క్రియేట్ చేస్తూ పోస్ట్ పెట్టడంతో అందరిలోనూ ఆసక్తి పెరిగింది. విశాఖను అంతర్జాతీయంగా మరింత ఉన్నత స్థాయిలో నిలబెట్టేందుకే ఈ కార్యక్రమం అని పలువురు భావిస్తున్నారు. ఆ ప్రపంచ ఛాంపియన్లు ఎవరు, వారు ఏ రంగంలో నిష్ణాతులు అనే వివరాలు తెలియాలంటే మంత్రి నుంచి రాబోయే అధికారిక ప్రకటన వరకు వేచి చూడాల్సిందే.

# భార్యను చంపి..డెడ్ బాడీతో...

**ఒంగోలు,** అనుమానంతో భార్యను హత్య చేసిన ఒక వ్యక్తి ఆమె మృతదేమాన్ని తీసుకెళ్లి పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయిన ఘటన బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలంలో వెలుగు చూసింది. వివరాల్లోకి వెళ్తే.. ఏల్చూరుకు చెందిన వెంకటేష్ కు పదేళ్ళ క్రితం పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలం మాచవరం కు చెందిన మహాలక్ష్మితో వివాహం అయింది. వీరికి ఇద్దరు సంతానం. ఆరు నెలల కిందట భార్యాభర్తలు మధ్య గొడవలు జరిగాయి. దీంతో మహాలక్ష్మి పుట్టింటికి వెళ్ళిపోయింది. అయితే ఆమె ప్రవర్తనపై అనుమానం పెంచుకున్న వెంకటేష్ రెండు రోజుల క్రితం మాచవరం వచ్చాడు. భార్యతో మాట్లాడి కూతురు బంగారు ఆభరణాలు తీసుకెళ్ళడానికి తనతో ఏల్చూరు రావాలని భార్యను అడిగాడు. అందుకు సమ్మతించిన మహాలక్ష్మి.. భర్త వెంకటేష్ తో కలిసి బైక్ పై ఏల్చూరు బయలు దేరింది. కొంతదూరం వెళ్ళిన తర్వాత ఆమెతో వెంకటేష్ ఘర్షణ పడ్డాడు. అనంతరం చలికోటు లేస్ తో ఆమె గొంతు బిగించి హత్య చేశాడు. ఏం చేయాలో తెలియక మృతదేహంతో నేరుగా బాపట్ల జిల్లా సంతమాగులూరు పిఎస్ కు వెళ్ళాడు. తన భార్యను హత్య చేసి మృతదేహంతో స్టేషన్ కు వచ్చినట్లు చెప్పాడు. దీంతో కంగుతిన్న పోలీసులు వెంటనే వెంకటేష్ ను అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయాన్ని రొంపిచర్ల పోలీసులకు చెప్పారు. రొంపిచర్ల పోలీసులు వెంటనే సంతమాగులూరు వెళ్ళి మహాలక్ష్మి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అక్కడ నుండి నర్సరావుపేట పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రాథమికంగా అనుమానంతోనే భార్యను హత్య చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు.

## భార్యకు మసాజ్ చేస్తానని...
# పాముతో కాటు వేయించి..

**ముంబై,** ముంబై మహానగరం సమీపంలోని బద్లాపూర్‌లో ఈ సంచలన హత్య కేసు వెలుగు చూసింది. భర్తే భార్యను విష సర్పంతో కాటేయించి హత్య చేశాడు. మూడేళ్ల క్రితం సహజ మరణంగా భావించిన ఈ కేసు ఆ తర్వాత జరిపిన విచారణలో అత్యంత భయంకరమైన, కుట్రపూరిత హత్యగా తేలింది. హత్య చేయబడిన మహిళ కూడా సాదాసీదాగా అనుకోవడానికి లేదు.. తను ఓ రాజకీయ పార్టీకి చెందిన ఉన్నత స్థాయిలో ఉన్న మహిళ. స్థానిక కాంగ్రెస్ పార్టీ మహిళా నేత నీర్జా ఆంబేకర్ మరణం పాము కాటుతో జరిగిందని గతంలో అంతా నమ్మారు.. జరిగింది కూడా ఇదేనంటూ నిజాన్ని అందరూ మర్చిపోయారు. కానీ, ఇది ఇప్పుడు సాధారణ ప్రమాదం కాదు.. పక్కా ప్రణాళికతో చేసిన హత్య అని సంచలన విషయాలు బయటపడ్డాయి. ఇక్కడ మరో ట్విస్ట్ ఏంటంటే.. ఈ హత్యకు మాస్టర్‌మైండ్ ఎవరో కాదు.. స్వయానా నీర్జా భర్త రూపేశ్ ఆంబేకరే అని పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ఈ ఘటనకు సంబంధించి అంబర్నాథ్ ఏసీపీ శైలేష్ కాలే వివరాలు తెలియజేశారు. 2022లో బద్లాపూర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ మహిళా నేత నీర్జా ఆంబేకర్ అకస్మాత్తుగా మృతి చెందారు. డాక్టర్లు పాము కాటు వల్ల జరిగిన మరణమని నిర్ధారించగా, పోలీసులు అప్పట్లో కేవలం ఏడీఆర్ నమోదు చేసి కేసును ముగించారు. కానీ, మూడేళ్ల తర్వాత ఈ కేసులో చోటు చేసుకున్న పరిణామాల ద్వారా పోలీసులకు సంచలన నిజాలు తెలిశాయి. ఇటీవల బద్లాపూర్‌లో మరో హత్యాయత్నం కేసులో పోలీసులు నిందితుడు ఋషికేష్ చాళ్కేను అరెస్టు చేశారు. విచారణలో పాత నేరాలపై కఠినంగా ప్రశ్నించగా, అతడు నీర్జా ఆంబేకర్ హత్య రహస్యాన్ని బయటపెట్టినట్లు ఏసీపీ శైలేష్ కాలే వెల్లడించారు. ఇదంతా ఇలా ఉండగా.. నీర్జా హత్యను ఆమె భర్త రూపేశ్ ఆంబేకర్ తన ముగ్గురు సహచరులు చేతన్ దుధానే, కునాల్ చౌధరీ, ఋషికేష్ చాళ్కేతో కలిసి చేయించినట్లు అంగీకరించాడు. హత్యను సహజ మరణంలా చూపించేందుకు నిందితులు అత్యంత భయంకరమైన మార్గాన్ని ఎంచుకున్నారు. వాళ్లు హత్యను అమలు చేశారో తెలుసుకున్నాక పోలీసులు కూడా షాక్‌కు గురయ్యారు. పక్కా ప్లాన్ ప్రకారం.. ముందే ఓ విష సర్పాన్ని బస్తాలో దాచి తెచ్చి నీర్జా ఇంటి వంటగదికి తీసుకువచ్చారు. అదే మంచి సమయంగా చూసుకుని భార్య కాళ్లు మర్దన, మసాజ్ చేస్తాననే నెపంతో నీర్జాను రూపేశ్ హాల్‌లో పడుకోబెట్టాడు. తనకు ఈ హత్యలో సహకరించిన మిత్రుడు చేతన్ దుధానే బస్తా నుంచి పామును తీసి ఋషికేష్ చాళ్కే అనే మరో వ్యక్తికి ఇచ్చారు. ఆ తర్వాత నీర్జా ఎడమ కాలి మడమ వద్ద పాముతో మూడు సార్లు బలవంతంగా కాటు వేయించారు. హత్య అనంతరం ఈ ఘటనను సహజ మరణంగా చిత్రీకరించేందుకు ప్రయత్నించారు. నీర్జా మృతదేహానికి ఎలాంటి పోస్టుమార్టం జరగలేదు. దీంతో భర్త రూపేశ్ వాంగ్మూలం ప్రకారం.. కేవలం ఇది సహజ మరణంగానే భావించి, ఏడీఆర్ నమోదు చేసి కేసును అప్పట్లో మూసివేశారు.

# పతంజలి వర్శిటీకి మరో ఘనత

**లక్నో,** హరిద్వార్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో పతంజలి విశ్వవిద్యాలయాన్ని సాంస్కృతిక మంత్రిత్వ శాఖకు చెందిన జ్ఞాన్ భారతం మిషన్ క్లస్టర్ సెంటర్‌గా గుర్తించినట్లు మంత్రిత్వశాఖ పేర్కొంది. దీంతో పతంజలి విశ్వవిద్యాలయ ఛాన్సలర్ స్వామి రాందేవ్, వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఆచార్య బాలకృష్ణ, జ్ఞాన్ భారతం మిషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్లు డాక్టర్ అనిర్వన్ దాష్, డాక్టర్ శ్రీధర్ బారిక్ , విశ్వరంజన్ మాలిక్ సమక్షంలో ఒప్పందంపై సంతకం చేశారు. ఈ పతాంజలి విశ్వవిద్యాలయం ఈ ఘనత సాధించిందేకు సహకరించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా, సాంస్కృతిక మంత్రి గజేంద్ర షెకావత్, జ్ఞాన భారతం మిషన్ మొత్తం బృందానికి యోగా గురువు రాందేవ్ బాబా కృతజ్ఞతలు తెలిపారు. భారతీయ జ్ఞాన సంప్రదాయాన్ని పరిరక్షించడానికి జ్ఞాన భారతం మిషన్ ఒక ఉదాహరణగా యోగా గురువు అభివర్ణించారు. ఈ సందర్భంగా, డాక్టర్ ఆచార్య బాలకృష్ణ మాట్లాడుతూ, ఈ మిషన్ కింద ఇప్పటివరకు 33 ఎంఓయూలు కుదుర్చుకున్నామని తెలిపారు. పతంజలి విశ్వవిద్యాలయం యోగా విద్యకు అంకితమైన మొదటి క్లస్టర్ కేంద్రంగా. పతంజలి విశ్వవిద్యాలయం ఇప్పటివరకు 50,000 పురాతన గ్రంథాలను భద్రపరిచిందని, 4.2 మిలియన్ పేజీలను డిజిటలైజ్ చేసి, 40 కి పైగా మాన్యుస్క్రిప్ట్‌లను శుద్ధి చేసి తిరిగి ప్రచురించిందని తెలిపపారు. జ్ఞాన్ భారతం క్లస్టర్ కేంద్రంగా పతంజలి ఇప్పుడు 20 కేంద్రాలకు శిక్షణ ఇస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా, జ్ఞాన్ భారతం మిషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ అనిర్వన్ దాష్ మాట్లాడుతూ, జ్ఞాన్ భారతం మిషన్ కింద క్లస్టర్ కేంద్రంగా ఉన్న పతంజలి విశ్వవిద్యాలయం యోగా, ఆయుర్వేదం ఆధారంగా మాన్యుస్క్రిప్ట్‌లపై పరిశోధన చేయడమే కాకుండా, దానిని విద్యా విప్లవంతో అనుసంధానించి దేశానికి, సమాజానికి చేరేలా చేస్తుందని తెలిపారు.

# రఘురామ టార్చర్..

**గుంటూరు,** సీనియర్ ఐపీఎస్ అధికారి పి.వి. సునీల్ కుమార్ గుంటూరులోని సీసీఎస్ పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరయ్యారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి నరసాపురం ఎంపీ, ప్రస్తుత డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజును సీఐడీ పోలీసుల కస్టడీలో హింసించిన కేసులో సునీల్ కుమార్ ప్రధాన నిందితుడిగా ఉన్నారని తెలిసిందే. ఈ కేసు విచారణను విజయనగరం ఎస్పీ దామోదర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. గత నెల 26న డిసెంబర్ 4న విచారణకు హాజరు కావాలని తొలి నోటీసు జారీ చేయగా, కుటుంబ సభ్యులు అనారోగ్యంతో ఉన్నందున గడువు కావాలని ఐపీఎస్ సునీల్ కుమార్ కోరారు. ఈ నెల 6న రెండోసారి నోటీసు ఇచ్చి డిసెంబర్ 15న విచారణకు రావాలని ఆదేశించారు. దీంతో సోమవారం (డిసెంబర్ 15) నాడు సునీల్ కుమార్ గుంటూరు సీసీఎస్ పీఎస్‌లో విచారణకు హాజరయ్యారు. 2021లో గత ప్రభుత్వ హయాంలో నరసాపురం ఎంపీ రఘురామకృష్ణరాజును ఆంధ్రప్రదేశ్ సీఐడీ పోలీసులు రాజద్రోహం ఆరోపణల కింద అరెస్టు చేశారు. అరెస్టు అనంతరం పోలీసు కస్టడీలో ఉన్న సమయంలో తనను తీవ్రంగా హింసించారని, ఈ క్రమంలో తన కాళ్లకు గాయాలయ్యాయని రఘురామ ఆరోపించారు. ఈ విషయంపై ఆయన కోర్టును ఆశ్రయించగా, అప్పట్లో దేశవ్యాప్తంగా ఈ ఘటన సంచలనం సృష్టించింది. ఆ సమయంలో సీఐడీ అదనపు డీజీగా పనిచేసిన పి.వి. సునీల్ కుమార్‌పైనే ఈ కేసులో ప్రధానంగా ఆరోపణలున్నాయి. ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రఘురామకు కస్టోడియల్ టార్చర్ కేసు విచారణ వేగం పుంజుకుంది. ప్రస్తుతం రఘురామ ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా కొనసాగుతున్నారు.

# ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టిలో చేరిన గంగాధర మండల నూతన ప్రజానిధులు



**చొప్పదండి** కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమన్న నమ్మకంతోనే కాంగ్రెస్ పార్టీలో చేరికల పర్వం కొనసాగుతోందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం లో పలు గ్రామాలలో నూతనంగా ఎన్నికల్లో గెలిచిన సర్పంచ్ లు వార్డ్ మెంబర్ లు సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరగా చొప్పదండి నియోజకవర్గం ఎమ్మెల్యే డా మేడిపల్లి సత్యం మధురా నగర్ లోని ప్రజా కార్యాలయంలో ప్రజా ప్రజా నిధులకు పార్టి కండువాలు కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆస్వానించారు. ఈ సందర్భంగా గర్షకుర్తి గ్రామ సర్పంచ్ చిందం ఆంజనేయులు, ఉప సర్పంచ్ దాది లావణ్య హరీష్ ,వార్డు సభ్యులు దాది మోహన్,గజ్జెల రేవతి–రవి,చిందం శ్రీనివాస్,వేముల ధనలక్ష్మి,చిప్ప స్రవంతి–సురేశ్,దూస మధు,చిప్ప కమల,కట్ట కావ్య శ్రీ–వేణు,రామిడి శ్రీనివాస్, సోమవారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా గంగాధర ప్రజా కార్యాలయంలో ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంక్షేమ పథకాలన అమలు చేయడంలో కాంగ్రెస్ పార్టీ ముందుంటుంది. ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేస్తోందని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామాల్లో అభివృద్ధి జరుగుతుందన్నారు. వర్గంలోని ప్రతి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తీర్మల్ రావు, చిప్ప చక్రపాణి,శ్రీనివాస్,గుండ రాజేశం, దూసరాజు, సుధాకర్,కొలిపాక రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల నిర్వహణకు
# పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

### - కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి** 3వ విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. సోమవారం ఐడిఓసి కార్యాలయం నుండి 3వ విడత గ్రామ పంచాయతి ఎన్నికలు జరుగనున్న కాటారం, మల్హర్, మహదేవపూర్, మహా ముత్తారం మండలాల రెవెన్యూ, ఎంపీడీఓలు, మండల ప్రత్యేక అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 3వ విడత నిర్వహణలో భాగంగా 16న పోలింగ్ మెటీరియల్ పంపిణీ, 17వ తేదీన పోలింగ్, 2 గంటల తదుపరి ఓట్లు లెక్కింపు తదితర అంశాలపై దిశానిర్దేశం చేశారు. మొదటి, రెండవ విడతల్లో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా నిర్వహించారని భాగస్వాములైన అధికారులను, సిబ్బందిని అభినందించారు. అదే స్ఫూర్తితో 3వ విడత జరుగనున్న ఎన్నికలను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. విధులు కేటాయించిన సిబ్బంది 16వ తేది ఉదయం 10 గంటల వరకు మెటీరియల్ పంపిణీ కేంద్రాలకు చేరుకోవాలని తెలిపారు. పోలింగ్ మెటీరియల్ తీసుకున్న తదుపరి పరిశీలన అనంతరం కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకుని 17వ తేదీన జరుగనున్న పోలింగ్ కు అన్ని ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు.

17వ తేదీన ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభం కావాలని తెలిపారు. పోలింగ్ ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుందని, తదుపరి మధ్యాహ్నం 2గంటల నుండి ఓట్లు లెక్కింపు ప్రక్రియ ప్రారంభించాలని ఆదేశించారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో వయోవృద్ధులు, దివ్యాన్గుల సౌలభ్యతకు వీల్ చైర్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. మండల పర్యవేక్షణ అధికారులు పోలింగ్ సరళిని పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఓటర్లు అధికంగా పోలింగ్ కేంద్రాలకు అదనపు సిబ్బందిని నియమించాలని సూచించారు. క్రిటికల్, సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాలలో వెబ్ క్యాస్టింగ్, మైక్రో అబ్జర్వర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ట్రైని డిప్యూటీ కలెక్టట్ నవీన్ రెడ్డి,డిపిఓ శ్రీలత, డీఈఓ రాజేందర్, డిఆర్డీఓ బాలకృష్ణ, నాలుగు మండలాల ఎంపీడీఓలు, తహసిల్దారులు, ఎంపీఓలు, ఏపీఎంలు తదితరులు పాల్గొన్నారు.

## మూడవ విడత ఎన్నికల
# ర్యాండమైజేషన్ పూర్తి

**జయశంకర్ భూపాలపల్లి.** మూడవ విడత జరుగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహణకు విధులు కేటాయించిన సిబ్బందికి మూడవ విడత ర్యాండమైజేషన్ నిర్వహించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. కాటారం,మల్హర్, మహదేవపూర్, మహా ముత్తారం మండలాల్లో 3వ విడత జరుగనున్న పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఈనెల 17వ తేదీన ఎన్నికల విధులు నిర్వహించే పిఓ, ఓపిలకు సోమవారం ఐడిఓసి కార్యాలయంలో మూడవ విడత ర్యాండమైజేషన్ ద్వారా పోలింగ్ కేంద్రాలను కేటాయించినట్లు ఆయన తెలిపారు. ఎన్నికల సంఘం నిబంధనలను పాటిస్తూ ర్యాన్డమైజేషన్ నిర్వహించినట్లు తెలిపారు.. ఏకగ్రీవమైన సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు పోలింగ్ జరపాల్సిన అవసరం లేకపోవడం వల్ల ర్యాండమైజేషన్ ప్రక్రియలో మినహాయింపు కల్పించామని తెలిపారు. స్థానికత, విధులు నిర్వర్తిస్తున్న మండలం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని, ర్యాండమైజేషన్ ద్వారా సిబ్బందిని కేటాయించినట్లు ఆయన స్పష్టంచేశార. 20 శాతం సిబ్బందిని రిజర్వ్ లో ఉంచుతూ ర్యాండమైజేషన్ చేసినట్లు ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

# పూడూరు డివిజన్ ను ఏర్పాటు చేయాలి

**మేడ్చల్ కలెక్టరేట్, జీహెచ్ఎంసీ,మేడ్చల్**

**డిప్యూటీ కమిషనర్ ఆఫీస్ లో వినతి పత్రం అందజేత**



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) మున్సిపాలిటీని రెండుగా విభజించి జీహెచ్ఎంసిలో కిష్టాపూర్ పేరుతో ఏర్పాటు చేసిన డివిజన్ ను మార్చి పూడూరు పేరుతో ఏర్పాటు చేయాలని పూడూరు గ్రామస్తులు కోరుతున్నారు.ఈ మేరకు సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డికి,జీహెచ్ఎంసి ప్రధాన కార్యాలయం,మేడ్చల్ డిప్యూటీ కమిషనర్ చంద్ర ప్రకాష్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీహెచ్ఎంసీ అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తూ కిష్టాపూర్ వార్డును ఏర్పాటు చేస్తున్నట్లుగా గెజిట్ విడుదల చేయడం సరికాదన్నారు. వార్డుల డీలిమిటేషన్ ప్రక్రియ సరిగా లేదని జీహెచ్ఎంసీ అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ వార్డుల విభజన చేయడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు.మేడ్చల్ మున్సిపాలిటీకి అనుబంధ గ్రామంగా కొనసాగిన కిష్టాపూర్ ను డివిజన్ వార్డుగా ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకిస్తున్న మన్నారు.పూడూరు,కిష్టాపూర్ కన్నా విస్తీర్ణంలో పెద్ద గ్రామమని 3500ఎకరాల రెవెన్యూ భూముల ఉన్నాయన్నారు.అంతేకాకుండా 4200మంది ఓటర్లు ఉన్నారన్నారు.దీంతోపాటుగా 14గ్రాములకు కేంద్రంగా ఆదర్శ రైతు సేవా సహకార సంఘం కొనసాగుతుందని గుర్తుచేశారు.జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,పల్లె దవాఖాన,వెటర్నరీ ఆసుపత్రి,పోస్ట్ ఆఫీస్,గ్రంథాలయంతోపాటు అద్భుతమైన వార్డు కార్యాలయం ఉందన్నారు.అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న పూడూరును డివిజన్ వార్డుగా ప్రభుత్వము,జీహెచ్ఎంసీ అధికారులు ఏర్పాటు చేయాలని కోరారు.గ్రామంలో మౌలిక సదుపాయాలైన సెంట్రల్ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, స్ట్రీట్ లైట్స్, ఇంటింటికీ గ్యాస్ పైపు లైన్ సరఫరా సౌకర్యం అద్భుతంగా ఉన్నాయన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో సొసైటీ మాజీ చైర్మన్ సత్యనారాయణ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సింగరేణి పోచయ్య,సొసైటీ మాజీ డైరెక్టర్ శేఖర్ రెడ్డి, మాజీ వార్డు సభ్యుడు తుపాకుల కృష్ణ, నాయకులు పుట్నాల నర్సింహులు ఉన్నారు.

# తుది విడత పోలింగ్ కు సిబ్బంది కేటాయింపు

నిజామాబాద్(ప్రశ్న న్యూస్) గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా మూడవ విడతలో ఎన్నికలు జరిగే మండలాల పోలింగ్ సిబ్బంది తుది ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి, ఎన్నికల సాధారణ పరిశీలకులు శ్యాంప్రసాద్ లాల్ సమక్షంలో సోమవారం నిర్వహించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఎన్.ఐ.సీ హాల్ లో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ ర్యాండమైజేషన్ జరిపించారు. ఈ ప్రక్రియను కలెక్టర్, అబ్జర్వర్ నిశితంగా పరిశీలించారు. ఏకగ్రీవం అయిన వాటిని మినహాయిస్తూ, ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్న మిగిలిన గ్రామ పంచాయతీలకు సంబంధించి ఒక్కో మండలం వారీగా ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికల పోలింగ్ విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు, ఓ.పీ.ఓలను ర్యాండమైజేషన్ ద్వారా పోలింగ్ కేంద్రాలకు కేటాయించారు.

**మూడవ విడత పోలింగ్ వివరాలు..**

నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ డివిజన్లోని ఆలూర్, ఆర్మూర్, బాల్కొండ, భీమ్గల్, డొంకేశ్వర్, కమ్మర్పల్లి, మెండోరా, మోర్తాడ్, ముప్కాల్, నందిపేట్, వేల్పూర్, ఏర్గట్ల మండలాల పరిధిలో గల





గ్రామాలలో పోలింగ్ తేదీ ఈ నెల17న
సమయం ఉదయం 7.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు మొత్తం సర్పంచ్ స్థానాలు 165,
ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్ స్థానాలు 19,
ఎన్నికలు జరుగనున్న సర్పంచ్ స్థానాలు 146,
పోటీలో ఉన్న అభ్యర్థులు 562,
మొత్తం వార్డు స్థానాలు 1620 ,నామినేషన్లు దాఖలు కాని వార్డు స్థానాలు
ఏకగ్రీవంగా ఎన్నికైన వార్డు స్థానాలు 490,
ఎన్నికలు జరుగనున్న వార్డు స్థానాలు 1130,అభ్యర్థులు 3382,
ఓటర్ల సంఖ్య 3,06,795,
పోలింగ్ కేంద్రాలు 1490,
ఓట్ల లెక్కింపు మధ్యాహ్నం 2 గం. నుంచి ప్రారంభం,
పీవోలు 1490,ఓపీవోలు 2278,సిబ్బంది తరలింపునకు రూట్లు 38,మైక్రో అబ్జర్వర్లు 58,జోనల్ అధికారులు 38,
వెబ్ క్యాస్టింగ్ పోలింగ్ కేంద్రాలు 51 ఉన్నాయి.

ఈ ప్రక్రియలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రావు, నోడల్ అధికారి పవన్ కుమార్, లీడ్ బ్యాంక్ మేనేజర్ సునీల్, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆశాలపై పని భారం తగ్గించాలి

**ఆశాలపై వేధింపులు ఆపాలి**

**ఆశాలతో పెట్టి చాకిరి చేయించకూడదు**

**బాలానగర్ పీఎస్సీలోని 7 గురు ఆశలకు జీతం ఇవ్వాలి**

**దుర్భాషలాడిన అధికారులపై చర్యలు చర్యలు తీసుకోవాలి**



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ఆశా వర్కర్స్ పై పని భారం తగ్గించాలని కోరుతూ తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్, సి ఐ టి యూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు.ఈ ధర్నా యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు కే. ఉన్నికృష్ణన్ అధ్యక్షత నిర్వహించారు. అనంతరం ఉన్నికృష్ణన్ మాట్లాడుతూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో పనిచేస్తున్న ఆశా వర్కర్లను ఆన్లైన్ పేరు మీద దుర్భాషలాడుతూ మానసికంగా వేధిస్తున్నారని , అధికారులు ఈ చర్య ఆపకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే సమస్య పరిష్కరించాలని డి. ఏం అండ్ హెచ్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని తెలిపారు. అయినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని దానివల్లే ఈరోజు నుంచి ఐదు రోజులు పాటు కలెక్టర్ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్ష చేయాలని నిర్ణయించామని తెలిపారు. 22న సోమవారం నాడు కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించాలని యూనియన్ నిర్ణయించడం ఉన్నికృష్ణన్ పేర్కొన్నారు. సిఐటియు జిల్లా నాయకుడు ఎం .కిష్టప్ప మాట్లాడుతూ అధికారులు మహిళలను చూడకుండా వేధిస్తే సిఐటియు చూసి ఊరుకోరని ఎంత పోరాటం చేయాలో అంత పోరాటం చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆశా వర్కర్లకు ఇస్తున్న వేతనాన్ని ఆపడానికి మెడికల్ ఆఫీసర్ కి ఎవరు ఇచ్చారు హక్కు అని ఆయన ప్రశ్నించారు.భారతదేశంలో పెట్టి చాకిరీ లేదు అని తెలుసుకోవాలని 30 రోజులు వచ్చిన తర్వాత జీతం ఇవ్వకుండా చేసే పద్ధతిని వెట్టిచాకిరి కాదా అని ప్రశ్నించారు బాలనగర్ మెడికల్ ఆఫీసర్ చేయిస్తే ఊరుకోమని తీవ్రంగా ఖండించారు. ఆన్లైన్ పని మీద ఫోను, నెట్ రీచార్జ్, ట్రైనింగ్ ఇవ్వకుండా పని చేయమంటే ఎలా చేస్తారని ఆయన ప్రశ్నించారు. డి ఎం అండ్ హెచ్ ఓ జోక్యం చేసుకోని ఈ సమస్యకి పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు ఈ ధర్నాలో తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం రేవతి కళ్యాణి జిల్లా కోశాధికారి రాధా నాయకులు లతా. జయప్రద. కవిత తో పాటు కీసర చర్లపల్లి మల్లాపూర్ఆశ వర్కర్స్ పాల్గొన్నారు

## రోటరాక్ట్ క్లబ్ 13వ ఇన్‌స్టాలేషన్ ఘనంగా నిర్వహణ




మేడ్చల్ (ప్రశ్న న్యూస్) రోటరాక్ట్ జిల్లా 3150 ఆధ్వర్యంలో పనిచేస్తున్న సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాల రోటరాక్ట్ క్లబ్ 13వ ఇన్‌స్టాలేషన్ కార్యక్రమాన్ని కళాశాల ప్రాంగణం రోజమ్మ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. కళాశాల యాజమాన్యం అందిస్తున్న నిరంతర సహకారం, మార్గదర్శకత్వంతో రోటరాక్ట్ క్లబ్ విద్యార్థుల నాయకత్వ వికాసం, వ్యక్తిత్వ అభివృద్ధి వృత్తి నైపుణ్యాల పెంపకంపై చురుకుగా పనిచేస్తోందని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమానికి కళాశాల కార్యదర్శి టి.వి. రెడ్డి, జిల్లా రోటరాక్ట్ ప్రతినిధి రోట్రాక్టర్ వంశీ వినోద్, గ్రూప్ రోటరాక్ట్ ప్రతినిధి రోట్రాక్టర్ ఏవీఎన్ఎస్ పవన్ ముఖ్య అతిథులుగా హాజరై నూతన పాలకవర్గాన్ని అభినందించారు. ఈ సందర్భంగా క్లబ్ గత ఏడాదిలో నిర్వహించిన వృత్తి అభివృద్ధి కార్యక్రమాలు, స్నేహబంధ కార్యక్రమాలు, సామాజిక సేవా కార్యక్రమాలు, అంతర్జాతీయ స్థాయి కార్యక్రమాలు, క్లబ్ నిర్వహణ కార్యక్రమాల వివరాలను సభ్యులు వివరించారు.ఈ కార్యక్రమంలోని ముఖ్య ఘట్టంగా నూతన అధ్యక్షురాలిగా రోట్రాక్టర్ హేమలత పుల్లోజు, కార్యదర్శిగా రోట్రాక్టర్ సాయి మణీష్ గౌడ్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అధ్యక్షురాలు హేమలత మాట్లాడుతూ, రోటరాక్ట్ క్లబ్ విద్యార్థులకు సేవతో పాటు నాయకత్వం, వృత్తి పరమైన దిశను అందించే వేదికగా కొనసాగుతుందని తెలిపారు. అన్ని విభాగాలలో సమతుల్యమైన కార్యక్రమాలు నిర్వహిస్తూ, క్లబ్‌తో పాటు సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రతిష్టను మరింత ముందుకు తీసుకెళ్లడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. కార్యదర్శి సాయి మణీష్ గౌడ్ మాట్లాడుతూ, సభ్యుల చురుకైన భాగస్వామ్యంతో క్లబ్ కార్యకలాపాలను క్రమబద్ధంగా నిర్వహిస్తామని తెలిపారు.విద్యార్థుల్లో నాయకత్వం, బాధ్యతాభావం మరియు సేవాస్ఫూర్తిని పెంపొందిస్తున్న సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యానికి రోటరాక్ట్ క్లబ్ కృతజ్ఞతలు తెలిపింది. రోటరాక్ట్ జిల్లా 3150లో సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాల రోటరాక్ట్ క్లబ్ అత్యంత చురుకైన క్లబ్‌లలో ఒకటిగా గుర్తింపు పొందుతూ, విద్యార్థి అభివృద్ధి మరియు సేవా కార్యక్రమాల్లో ముందుండి పనిచేస్తోందని నిర్వాహకులు తెలిపారు.

# ప్రజలు నిబంధనలు తప్పక పాటించాలి

**- కమిషనర్ సాయి చైతన్య**

నిజామాబాద్(ప్రశ్న న్యూస్) నిజామాబాద్ ప్రజలు ఈ దిగువ నిబంధనలు తూ.చ తప్పకుండా పాటించాలని పోలీస్ కమిషనర్ వెల్లడించారు.

**విగ్రహాల ప్రతిష్టాపన..**

ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా విగ్రహాలను ప్రతిష్టించరాదు, ముఖ్యంగా జనరద్దీగా ఉండే ప్రాంతాలు, పార్కులు, ఐలాండ్, ప్రభుత్వ భవనాలు లాంటి చోట్ల ఎటువంటి విగ్రహాలను ఏర్పాటు చేపట్టరాదు. విగ్రహాల ఏర్పాటుకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలోని కమిటీ యొక్క అనుమతులు తప్పనిసరిగా పొందవలసి ఉంటుంది.

**శబ్ద కాలుష్యం నియంత్రణ..**

ఎక్కువశబ్దంతో డి.జే లను ఏర్పాటుచేయరాదని, ఇలా చేయడం వల్ల దీర్ఘకాలికంగా అనారోగ్యంతో బాధపడే వృద్ధులు, చిన్న పిల్లలు, మహిళలు ఇబ్బంది పడే అవకాశాలు ఉన్నందున ప్రజలు జాగ్రత్తలు పాటించాలని తెలియజేశారు. రెసిడెన్షియల్ స్థలంలో, కమర్షియల్ స్థలాల్లో రాత్రి సమయంలో 55 డెసిబెల్స్ సౌండ్ వాడాలని రాత్రి 10 గంటల నుండి ఉదయం 6 గంటల వరకు డి.జే ల సౌండ్ సిస్టం పూర్తిగా నిషేదం గలదు. పోలీసుల అనుమతి తప్పనిసరి తీసుకోవాలి.

**ఊరేగింపులు, సభల నిర్వహణ..**

ఊరేగింపులు, బహిరంగ సభల్లో పరిమితులకు మించిన ధ్వని శబ్దం ఉత్పత్తి చేసే డి.జేలు. సౌండ్ సిస్టంలు నిజామాబాద్ కమిషనరేటు పరిధిలో నిషేదం గలదు, ఎవరైనా సభలు, సమావేశాలు జన సంచార ప్రదేశాల్లో లౌడ్ స్పీకర్లు పెట్టాలని భావిస్తే సంబంధిత అధికారుల నుండి ముందస్తుగా అనుమతి తీసుకోవాలి. 500 మందితో కూడిన సమావేశాలు లేదా సభలు నిర్వహించాలని భావిస్తే సంబంధిత అసిస్టెంటు పోలీస్ కమిషనర్ అనుమతి తప్పనిసరి 500 మంది కంటే ఎక్కువ జనాలతో కూడిన కార్యక్రమనికి 72 గంటల ముందుగా పోలీస్ కమిషనర్ అనుమతి తీసుకోవాలి.

**సార్వజనిక ప్రదేశాల్లో నియమాలు..**

మాల్స్, సినిమా థియేటర్స్, హెూటల్స్, ఎగ్జిబిషన్, బిజినెస్ ప్రదేశాల వద్ద ప్రజల కోసం సెక్యూరిటీ నిబంధనలు తప్పనిసరి పాటించాలి. ప్రతీ ఒక్కరు క్యూ పద్ధతిని తప్పనిసరి పాటించాలి.

**డ్రోన్ల వినియోగం పై ఆంక్షలు..**

డ్రోన్ల వాడకం వలన ఎక్కువ ప్రమాదాలు పొంచి ఉన్న నేపధ్యంలో నియంత్రణ చర్యలు తీసుకోవడం జరగుతుందని, ఈ డ్రోన్ల ఉపయోగం వలన జనజీవనానికి విఘాతం కలగడమే కాకుండా శాంతి భద్రతలకి విఘాతం వాటిల్లే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ,ఎవరయినా ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ప్రారంభించదలచినచో ముందస్తుగా సంబంధిత ప్రభుత్వ సంస్థలు, పోలీసు మరియు ఏవియేషన్ అధికారుల నుండి క్లియరెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలి.

**నకిలీ గల్ఫ్ ఏజెంట్ల నుండిఅప్రమత్తం..**

జిల్లాలో నకిలీ గల్ఫ్ ఏజెంట్లకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని పాస్ పోర్టు, వీసా, రవాణా, టూరిస్ట్ తదితర సేవలు కల్పిస్తామని మాయమాటలు చెప్పి చాలా మంది గల్ఫ్ ఏజెంట్లు అనదికారికంగా వ్యాపారాలు నిర్వహిస్తూ,అమాయక ప్రజలను మోసం చేస్తున్నారు. కావున జిల్లా ప్రజలు గల్ఫ్ ఏజెంట్లకు తమ ఇల్లు అద్దెకు ఇచ్చే ముందుజాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. అటువంటి వారు అద్దెకు వస్తే ముందస్తుగా వారి సమాచారాన్ని సంబంధిత పోలీసు స్టేషన్ వారికి తెలియజేయండి. ఎవరైనా అనుమానస్పదంగా కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వండి.

**" ఎ " సర్టిఫికెట్ ఉన్న సినిమాల వీక్షణం..**

నిజామాబాద్ జిల్లాలో " ఎ " (పెద్దలు) సర్టిఫికేట్ పొందిన సినిమాలను మైనర్లు చూడటానికి థియేటర్లను




అనుమతించరాదు.

**బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం నిషేధం..**

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వ్యక్తులు నిజామాబాద్ వీదుల్లో చట్టాన్ని గౌరవించే పౌరుల పట్ల ముఖ్యంగా మహిళలు, పిల్లల పట్ల అసభ్యకరమైన వికృత మరియు అసభ్యకరమైన ప్రవర్తన ను ప్రదర్శిస్తున్నట్లు నివేదికలు సూచిస్తున్నాయి. సాధారణంగా రోడ్డు వినియోగదారులకు, ముఖ్యంగా మహిళలు, పిల్లలకు చికాకు మరియు ఆటంకము కలిగించి ప్రజా ప్రశాంతతకు దారితీస్తుంది. కావున బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడాన్ని నిషేధిస్తూ ఆదేశాలు జారీచేయడం జరిగింది. పైన తెలియజేసిన నిబంధనలను ఎవ్వరయిన అతిక్రమించినయెడల వారిపై సంబంధిత చట్టాల ప్రకారం తగు చర్యలు తీసుకోవడానికి నిజామాబాద్ పోలీస్ కమిషనరేటు పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్లోని పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్.ఓ లకు / ఎస్.ఐ లకు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య అధికార ఉత్తర్వులను జారీచేశారు. ఈ ఉత్తర్వులు తేది:15-12-2025 నుండి తేది:31-12-2025 వరకు అమలులో ఉంటుంది. కావున ప్రజలందరూ సంబంధిత పోలీస్ అధికారులకు సహకరించగలరని కోరారు.

# సుతారిగూడ స్మశాన వాటికకు దారిని పునరుద్ధరించాలి

**ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ నేత సకార బోయిన మల్లేష్ ముదిరాజ్**



మేడ్చల్( ప్రశ్న న్యూస్) మేడ్చల్ జిల్లా గుండ్ల పోచంపల్లి జిహెచ్ఎంసి పరిధిలోని సుతారిగూడ గ్రామంలో వరదనీటితో ఏర్పడిన చెరువు కారణంగా స్మశాన వాటికకు వెళ్లే మార్గం మూసుకుపోయిందని దానిని మళ్లీ పునరుద్ధరించాలని గుండ్ల పోచంపల్లి జిహెచ్ఎంసి వర్కింగ్ ప్రెసిడెంట్ సాకార బోయిన మల్లేష్ ముదిరాజ్ కోరారు. ఈ మేరకు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సకారబోయిన మల్లేష్ ముదిరాజ్ మాట్లాడుతూ గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో, సుతారిగూడ గ్రామ నివాసులమని . మా గ్రామానికి చెందిన స్మశాన వాటిక గత 60 సంవత్సరాలుగా నిరంతరంగా ఉపయోగంలో ఉందని తెలిపారు . అయితే ఇటీవల వరదనీటితో చెరువు ఏర్పడిన కారణంగా స్మశాన వాటికకు వెళ్లే మార్గం పూర్తిగా మూసుకుపోయిందని తెలిపారు.దీంతో సుతారిగూడ గ్రామ ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని. స్మశానానికి వెళ్లేందుకు సరైన మార్గం లేకపోవడంతో, సుతారిగూడ చెక్‌పోస్ట్ నుండి మైసమ్మ వరకు ఉన్న ప్రధాన రహదారి పక్కన అంత్యక్రియలు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఇది గ్రామస్తులకు తీవ్రమైన ఇబ్బందులు, మానసిక వేదన అసౌకర్యాన్ని కలిగిస్తోందన్నా రు.ఈ అత్యవసర పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని, స్మశాన వాటికకు తిరిగి మార్గం కల్పించేందుకు చెరువు మీదుగా చిన్న పైప్‌లైన్, ఏర్పాటు చేయడానికి అవసరమైన అనుమతులు ఆమోదాలు మంజూరు చేయాలని నీటిపారుదల శాఖను మనవి చేసుకుంటున్నామని తెలిపారు.. దీనివల్ల మా సమాజపు హక్కులు, సంప్రదాయాలకు అనుగుణంగా గౌరవప్రదంగా అంత్యక్రియలు నిర్వహించుకోవడానికి అవకాశం కలుగుతుందని తెలిపారు. సంబంధిత శాఖలతో సమన్వయం చేసి అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయవలసిందిగా సకారబోయిన మల్లేష్ ముదిరాజ్ కోరారు అవసరమైతే దీనికి సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

## వృద్ధుల మృతిపై కాంగ్రెస్ నేతల సంతాపం

వరంగల్ ఈస్ట్, : హనుమకొండ జిల్లా కాజీపేట మండలం మడికొండ గ్రామంలో 46వ డివిజన్‌కు చెందిన దండిగం కొమురయ్య, దాసరి సుశీల, అలుగోజు కమలమ్మ అనే ముగ్గురు వృద్ధులు రాత్రి మృతి చెందారు. వారి నివాసాలకు వెళ్లి నగర కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వస్కుల శ్రీను పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వస్కుల వెంకటస్వామి, ఇందిరమ్మ ఇండ్ల కమిటీ మెంబర్ శివ నాగరాజు, బొజ్జ శ్రీను, మల్లికార్జున్, వస్కుల రాజు, నమిండ్ల రాజు కూడా పాల్గొని మృతులకు సంతాపం తెలిపారు.

**ఆలేరు గ్రామ పంచాయతీ భవనానికి**

## మరమ్మత్తులు ప్రారంభం

డోర్నకల్, : మహబూబాబాద్ జిల్లాలోని నెక్కొండ మండలానికి ఆనుకుని ఉన్న ఆలేరు గ్రామ పంచాయతీ కార్యాలయ భవనంలో మరమ్మత్తు పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. పాతబడిపోయిన భవనంలో చీలికలు, గోడలు ఊడిపోవడం వంటి సమస్యలు తలెత్తడంతో అధికారులు ఈ చర్యలు చేపట్టారు. నేల బలపర్చడం, పైకప్పు మరమ్మతు, గోడలు, వరండా, నీటి పారుదల ఏర్పాట్లు వంటి పనులు చేయాలని గ్రామ పంచాయతీ అధికారులు తెలిపారు.

## అరకొర వైద్యం.. వసతులు శూన్యం..

వరంగల్ వెస్ట్, : జనగామ జిల్లాకేంద్రంలో పలు ప్రైవేటు ఆసుపత్రులకు పూర్తిస్థాయిలో సౌకర్యాలు లేకున్నా వైద్యాధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేవలం వైద్యశాల అనుమతి రెన్యూవల్ అయిందా లేదా అనే కోణంలో తప్ప ఇతర విషయాలేవీ పరిగణనలోకి తీసుకోవడం లేదు. విశాలమైన భవన నిర్మాణం, పార్కింగ్ సదుపాయం, ఫైర్ సేఫ్టీ పరికరాలు, శస్త్ర చికిత్స గదులు, ప్రత్యేక గదుల ఏర్పాట్లు, అంబులెన్స్ సదుపాయాలు లేకున్నా చూసీచూడనట్లుగా తనిఖీలు ముగిస్తున్నారు. మెటర్నటీ ఆసుపత్రుల్లో ఈ నిర్లక్ష్యం ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. దీనికి తోడు జనగామ జిల్లాకేంద్రంలో పలు రాజకీయ పలుకుబడి ఉన్న కొందరు వైద్యులకు చెందిన ప్రైవేటు ఆసుపత్రులను తనిఖీ చేయాలంటే వైద్యాధికారులు వెనుకంజ వేస్తున్నట్లు సమాచారం.

## బాలుడిని తన్నిన గుర్రం.. చికిత్స పొందుతూ మృతి

వర్ధన్నపేట, : గుర్రం తన్నిన ఘటనలో గాయపడిన బాలుడు చికిత్స పొందుతూ మృతిచెందారు. మిల్స్‌కాలనీ సీఐ రమేశ్ కథనం ప్రకారం.. శివనగర్ పాడి మల్లారెడ్డినగర్‌కు చెందిన మిర్యాల గౌతం(12) ఈ నెల 10న బాబాయి నాగేంద్రతో కలిసి ఖిలా వరంగల్‌లోని ఏకశిల చిల్డ్రన్స్ పార్క్‌కు వెళ్లాడు. అక్కడ పర్యాటకులు సవారీ చేసేందుకు ఉంచిన గుర్రం ఉంది. దానికి దగ్గరగా వెళ్లిన గౌతంను కడుపులో తన్నింది. తీవ్రంగా గాయపడిన బాలుడిని ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందారు. తండ్రి కృష్ణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

మెదక్, : హవేలి ఘనపూర్ మండల పరిధిలోని లింగసానిపల్లి వద్ద రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని లింగసానిపల్లి తండాకు చెందిన ముడావత్ భాస్కర్ (36) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. భాస్కర్ బైక్‌పై వైపు వెళ్తుండగా, లింగసానిపల్లి సమీపంలోని మలుపు వద్ద ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. మృతునికి ఇద్దరు భార్యలు రేనా, స్వరూప, నలుగురు పిల్లలున్నారు.

# ప్రజల అభిమానాన్ని చూరగొన్న చెర్ల మురళి

## - ప్రజా హృదయాల్లో చిరస్థాయిగా నిలుస్తారు

## - చెర్ల మురళి కుటుంబానికి కేటీఆర్ పరామర్శ - ప్రగాఢ సంతాపం



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ అర్బన్ మండలం, చింతల్ ఠాణా గ్రామ సర్పంచ్ పదవికి పోటీ చేసి, ఎన్నికల ఫలితాలకు ముందే మృతి చెందినప్పటికీ భారీ మెజారిటీతో గెలుపొందిన బీఆర్ఎస్ అభ్యర్థి చెర్ల మురళి కుటుంబాన్ని సోమవారం బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) పరామర్శించారు. ఈ సందర్భంగా చెర్ల మురళి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించిన కేటీఆర్, మృతుడు మురళి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం, సానుభూతి తెలిపారు. ప్రజల విశ్వాసం, ఆదరణకు చెర్ల మురళి నిలువెత్తు నిదర్శనంగా నిలిచారని, ప్రజల అభిమానాన్ని చూరగొన్న మురళి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలుస్తారని కేటీఆర్ పేర్కొన్నారు. కేటీఆర్ వెంట బీఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గం బాధ్యులు చల్మెడ లక్ష్మీ నరసింహా రావు, సీనియర్ నేత ఏనుగు మనోహర్ రెడ్డి, తదితర నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# శ్రీ రాఘవేంద్ర నగర్ కాలనీ నూతన కార్యవర్గ కమిటీ ఏర్పాటు



నాచారం(ప్రశ్న న్యూస్) నాచారం డివిజన్ శ్రీరాఘవేంద్ర నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ కమిటీని ఏర్పాటు చేసినట్లు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు ఇటీవల నిర్వహించిన సాధారణ సమావేశంలో కొత్త కమిటీపై తుది నిర్ణయం తీసుకున్నారు. అధ్యక్ష పదవికి మక్తాల శేఖర్ గౌడ్, సంగం యాదగిరి లకు సమాన ఓట్లు రావడంతో సీనియర్ సభ్యుల సూచనల మేరకు, అధ్యక్షుడిగా మక్తాల శేఖర్ గౌడ్ ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మక్తాల శేఖర్ గౌడ్ కాలనీ వాసులను ఉద్దేశించి మాట్లాడుతూ, గత 15 సంవత్సరాలుగా ఏకగ్రీవంగా అధ్యక్ష పదవిని నిర్వహించే అవకాశం కల్పించినందుకు గర్వంగా ఉందని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి మళ్లీ అధ్యక్ష పదవిని అప్పగించినందుకు కాలనీ వాసులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. కొత్తగా ఎన్నికైన కమిటీ సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ, కాలనీ అభివృద్ధి, శుభ్రత, సౌహార్ద వాతావరణం కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. కాలని వాసుల సూచనలతో కాలని అభివృద్ధి చేస్తానని తెలిపారు. శ్రీరాఘవేంద్ర నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఉపాధ్యక్షులుగా కటంగూరి శ్రీనివాస్ రెడ్డి, ఎన్. జోగేశ్వరరావు, లింగం యాదవ్, జనరల్ సెక్రటరీ గా సంగం యాదగిరి, ట్రెజరర్ కొప్పోజి ప్రవీణ్ చారి, సంయుక్త కార్యదర్శులు గా యవవరమ్ నరేష్ శర్మ, సంతోష్, వైకుంటమ్ కార్యనిర్వాహక సభ్యులు గా గణేష్, వేణు, వీరు లను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులందరికీ కాలనీ వాసులు శుభాకాంక్షలు తెలియజేశారు. రాబోయే కాలంలో కాలనీ అభివృద్ధి కార్యక్రమాల్లో కమిటీ విశేష విజయాలు సాధించాలని వారు ఆకాంక్షించారు.

# హెల్మెట్ లేకుంటే ఇంధనం లేదు

## ప్రాణ భద్రతే లక్ష్యం డిఎస్పి నరసింహమూర్తి



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) శ్రీకాళహస్తి పట్టణం, సబ్ డివిజన్ పరిధిలోని డిసెంబర్ 15 తేదీ నుంచి అన్ని పెట్రోల్ బంకుల్లో ద్విచక్ర వాహనదారులకు పెట్రోల్ పోసే సమయంలో, ద్విచక్ర వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ ధరించడం తప్పనిసరి అని శ్రీకాళహస్తి డిఎస్పి నరసింహమూర్తి తెలిపారు. అనంతరం నాలుగు మాడ వీధులలో తన సిబ్బందితో కలిసి దిశక్ర వాహనాలతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించని పక్షంలో పెట్రోల్ సరఫరా చేయవద్దని పెట్రోల్ బంక్ నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఈ నిబంధనను ఉల్లంఘించిన వారికి ఫైన్లు విధించబడతాయని హెచ్చరించారు. ఇది శిక్ష కోసం కాదు, ప్రజల ప్రాణ భద్రత కోసమేనని, మా ఫైన్ కంటే మీ భద్రతే, మీ కుటుంబ భద్రతే మాకు ముఖ్యం అని తెలిపారు. హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాద సమయంలో ప్రాణాలు కాపాడుకునే అవకాశం ఎక్కువగా ఉంటుందని, ప్రతి ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి పోలీసులకు, సమాజానికి సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమంలో సిఐలు నాగార్జున రెడ్డి, ప్రకాష్ కుమార్, తిమ్మయ్య, ఎస్సైలు వెంకటేష్, రవికుమార్, వెంకటరమణ, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మాజీ కౌన్సిలర్ ఇప్పపూల అజయ్ సేవలు ప్రశంసనీయం

## - కాంగ్రెస్ పార్టీ 21 వ వార్డు ఇంచార్జి : కోయల్కార్ మస్తాన్



వేములవాడ (ప్రశ్న న్యూస్)రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ మున్సిపల్ పరిధిలోని 22వ వార్డు మాజీ కౌన్సిలర్ ఇప్పపూల అజయ్ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని సోమవారం కాంగ్రెస్ పార్టీ 21వ వార్డు ఇంచార్జి కోయల్కార్ మస్తాన్, ఎస్సారార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంయుక్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచుతూ ఘనంగా సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా కోయల్కార్ మస్తాన్ మాట్లాడుతూ "ఇప్పపూల అజయ్ ప్రజాసేవే లక్ష్యంగా రాజకీయ జీవితాన్ని కొనసాగించారు. వార్డు అభివృద్ధితో పాటు ప్రజల సమస్యల పరిష్కారానికి ఎప్పుడూ ముందుండే నాయకుడు. ఆయనకు వేములవాడ రాజన్న దివ్యాశీస్సులతో మంచి ఆరోగ్యం, దీర్ఘాయుష్షు కలగాలని ఆకాంక్షిస్తున్నాను. భవిష్యత్తులో మరింత బాధ్యతాయుతమైన పాత్ర పోషిస్తూ ప్రజల ఆదరణతో ముందుకు సాగాలని కోరుకుంటున్నాను" అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎస్సారార్ అసోసియేషన్ సభ్యులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొని అజయ్‌కు హార్థిక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# దశాబ్ధాల పోరాటాన్ని దెబ్బకొట్టిన కేంద్రం

## - కోట్ల రూపాయల మావోయిస్టుల ఆస్తులు సీజ్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) పట్టు పట్టరాదు.. పట్టి విడుదరాదు.. పట్టి విడువటకన్నా.. పడి చచ్చుటమేలయా.. అన్న సామెతను కార్యరూపంలో పెట్టి చేసి మరీ చూపిస్తోంది కేంద్ర హెూమ్ శాఖ. దేశవ్యాప్తంగా వచ్చే ఏడాది మార్చి నాటికి మావోయిస్టుల అంతమే లక్ష్యంగా పెట్టుకుని, అదే పట్టుతో ముందు సాగుతూ ,దాదాపు లక్ష్యానికి చేరువలోకి వచ్చేసింది. మావోస్టుల విషయంలో కేంద్రం తీరుపై ప్రజాసంఘాలు మండిపడుతున్నా, మానవ హక్కుల ఉల్లంఘన అంటూ ఉద్యమనేతలు గోలపెడుతున్నా డోంట్ కేర్ అంటూ ముందుకు దూసుకుపోతోంది.

### - కనుమరుగవుతున్న మావోయిస్టు ఉద్యమం

ఏ ఉద్యమైనా ఆర్థిక మ్మూలాలను దెబ్బకొడితే, ఆ ప్రభావం , ఆయా ఉద్యమ్మాలపై తీవ్రంగా ఉంటుంది. అందులోనూ జనజీవన స్రవంతికి దూరంగా అడవుల్లో తిరుగుతున్న అన్నలపై ఇంకాస్త ఎక్కువే అని చెప్పవచ్చు. తాజాగా మావోయిస్టుల ఆస్తులను సీజ్ చేసినట్లు కేంద్రం అధికారికంగా ప్రకటించడం సంచలనంగా మారింది. దేశ వ్యాప్తంగా ఏకంగా 92కోట్ల రూపాయల అన్నల ఆస్తులను స్వాధీనం చేసుకోవడంతో , ఇప్పటికే కొనఊపిరితో ఉన్న మావోయిస్టు ఉద్యమం, ఇక దాదాపు కనుమరుగైయ్యే పరిస్థితులు ఏర్పాడ్డాయి.

### - ఆర్థిక మూలాలను దెబ్బతీస్తోన్న కేంద్రం

దేశంలో మావోయిస్టుల ఏరివేత లక్ష్యంగా పెట్టుకున్న కేంద్ర హెూంశాఖ, పలు దర్యాప్తు సంస్థలు మొదటి నుండి వ్యూహాత్మకంగా పనిచేస్తున్నాయి. ఓవైపు ఆపరేషన్ కగార్ పేరుతో భారీగా భద్రతా బలగాల కూంబింగ్, అత్యాధునిక సాంకేతిక పరిజానంతో మావోల గుర్తింపు, ఎన్ కౌంటర్ ఇలా దండకారణ్యంలో అన్నల ఏరివేత ప్రక్రియ కొనసాగిస్తూనే , మరోవైపు అంతే స్థాయిలో మావోయిస్టుల ఆస్తులపై, ఆర్థిక మూలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా ఇప్పటి వరకూ జాతీయ దర్యాప్తు సంస్ధ ఎన్ ఐఏ 40కోట్ల రూపాయల మావోయిస్టు ఆస్థులను సీజ్ చేసింది. ఢిల్లీ పోలీసులు మరో 40కోట్ల రూపాయల విలువైన ఆస్తులు జప్తు చేశారు. వీరితో పాటు ఎన్ఫోర్స్ మెంట్ డైరక్టరేట్ మరో 12 కోట్ల రూపాయలు స్వాధీనం చేసుకున్నారు. ఇలా మొత్తంగా ఇప్పటి వరకూ 92 కోట్ల రూపాయలు మావోయిస్టు ఆస్తులను, వారి మనుగడకు కీలకంగా మారిన ఆర్థిక మూలాలను కట్టడి చేస్తోంది కేంద్రం ప్రభుత్వం.

### - 2014లో 126.. 2025లో 11కి తగ్గిన ప్రభావం

ఇదిలా ఉంటే ఆపరేషన్ కగార్ కు ముందు , తరువాత మావోయిస్టుల ప్రాబల్యంపై కూడా కేంద్రం కోలుకోలేని దెబ్బకొట్టింది. 2014లో దేశంలో నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలు 126 జిల్లాలు ఉండగా, 2025 నాటి ఆ సంఖ్య 11 జిల్లాలకు మాత్రమే పరిమితమైయ్యింది. 2014లో మావోయిస్టు అత్యంత ప్రభావిత జిల్లాలు 36 ఉండేవి, అవి కాస్తా 2025 నాటి కేవలం 3 జిల్లాలకు చేరుకున్నాయి.

ఇంతలా మావోల ప్రభావంపై కోలుకోలేని దెబ్బకొట్టింది హెూంశాఖ. ఈ ఒక్క ఏడాదిలోనే ఏకంగా 317 మంది మావోయిస్టులు ఎన్ కౌంటర్ లో ప్రాణాలు కోల్పోయారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇప్పటి వరకూ 862 మంది మావోస్టులు అరెస్ట్ అయ్యారు. 1973 మంది మావోయిస్టులు లొంగిపోయ్యారు. ఒక్క అక్టోబర్ నెలలోనే చత్తీస్ ఘడ్, మహారాష్ట్రలలో 258 మంది మావోయిస్టులు లొంగిపోయినట్లు కేంద్ర అధికారిక లెక్కలే చెబుతున్నాయి.

ఇంతా మావోయిస్టు ఉద్యమం కుదేలవడానికి ప్రధాన కారణం , మావోయిస్టుల కీలక నేతలను కేంద్రం టార్గెట్ చేయడం.

2024 నుండి ఇప్పటి వరకూ 28 మంది హిడ్మా వంటి మావొయిస్టు అగ్రనేతలు వివిధ ఎన్ కౌంటర్లలో ప్రాణాలు కోల్పోయారు.

ఇలా దెబ్బమీద దెబ్బ అన్నట్లు ఏకంగా 60 ఏళ్ల నాటి సాయుధపోరాటం, మావోయిస్టుల ఉద్యమం అంతిమ దశకు చేరుకుంది. అనుకున్న లక్ష్యాన్ని పెట్టుకున్న గడువులోపే పూర్తి చేస్తామనే ధీమాతో కేంద్రం దూసుకుపోతోంది.

# ముఖానికి ముసుగులు వేసి దాడులా.?

## రాజ్యాంగం ఓడిందా.. రౌడీయిజం గెలిచిందా

- నిద్రావస్థలో రక్షణ వ్యవస్థ..
  పేదల ప్రాణాలకు విలువ లేదా.?
ముసుగులు వేసుకొని దాడులు చేస్తున్న
  మహిళలు ఎవరు.?
- జగద్గిరిగుట్టలో ముసుగు మూకల వీరంగం..
  చోద్యం చూస్తున్న అధికారులు



జగద్గిరిగుట్ట (ప్రశ్న న్యూస్) మహిళలు ముఖానికి ముసుగులు వేసుకొని గుంపులు గుంపులుగా వచ్చి కాలనీలోని ఉన్న మహిళలపై దాడులు చేయడం చూస్తుంటే ఎంత ధైర్యం చట్టం వీళ్లకు వర్తించదా.? శిక్షించదా.?సమాజంలో సామాన్యుడికి రక్షణ కల్పించాల్సిన వ్యవస్థలన్నీ చేతులెత్తేశాయా.? చట్టం తన పని తాను చేసుకుపోతుందని చెప్పే మాటలన్నీ నీటిమూటలేనా.? రాజధాని నడిబొడ్డున వందల మంది ముసుగులు ధరించి దాడి చేస్తుంటే.. పోలీసులు ఏం చేస్తున్నట్టు.? ప్రజల ఓట్ల ద్వారా గద్దెనెక్కిన ప్రజాప్రతినిధులు ఎవరికి కొమ్ము కాస్తున్నారు.? జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో డిసెంబర్ 14న జరిగిన ఘటన సభ్యసమాజం తలదించుకునేలా చేసింది. బాధితులు పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కినా.. న్యాయం కోసం ఆక్రందనలు చేసినా.. అరణ్య రోదనగానే మిగిలిపోతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### వందల మందితో దండయాత్ర..

జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని శంషుగూడ, సర్వే నంబర్ 57, ఫోర్త్ ఎస్టేట్ కాలనీలో గత దశాబ్దాలుగా నివాసం ఉంటున్న బాధిత కుటుంబంపై ఆదివారం నాడు భూ కబ్జాదారులు పగబట్టిన పాముల్లా విరుచుకుపడ్డారు. బి. సుబ్బారావు, పి. వెంకటేశ్వరరావు, పి. కృష్ణప్రియ, వారి అనుచరులైన వెంకట్, వినోదు, జి. ప్రీతి ఆధ్వర్యంలో వందల సంఖ్యలో గుర్తు తెలియని వ్యక్తులు ముసుగులు ధరించి ఉదయం నుండీ సాయంతం వరకు ఈ దారుణ కాండకు తెగబడ్డారని స్థానికులు ఆరోపిస్తున్నారు.



### చంపి పాతిపెడతాం.. పోలీసులేం పీకలేరు..

బాధితులు తమ ఇళ్లను కూల్చవద్దని ప్రాధేయపడినా, అడ్డుకున్న వారిపై ఈ ముఠా కర్కశంగా దాడి చేసి గాయపరిచింది. "మర్యాదగా ఇళ్లు ఖాళీ చేసి వెళ్ళిపోండి.. లేకపోతే ఇక్కడే చంపి పాతిపెడతాం.. మమ్మల్ని అడిగే నాథుడే లేడు.. పోలీసులు కూడా మమ్మల్ని ఏం చేయలేరు" అంటూ బాధితులను భయభ్రాంతులకు గురిచేయడం స్థానికంగా కలకలం రేపింది. ఖాకీలంటే వీరికి భయం లేదా.? లేక పోలీసులే వీరి వెనుక ఉండి నడిపిస్తున్నారా.? అన్న అనుమానాలు బలపడుతున్నాయి.

### రహదారులు దిగ్బంధం..

అక్రమ ఫెన్సింగ్ చట్టపరంగా ఎటువంటి హక్కులు లేకపోయినా, గతంలో కోర్టులు మొట్టికాయలు వేసినా, జిహెచ్ఎంసి అనుమతులు లేవని స్పష్టం చేసినా.. ఈ ముఠా అవేవీ లెక్కచేయకుండా బ్లూ షీట్ల సహాయంతో అక్రమంగా ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది. బాధితుల ఇళ్ల చుట్టూ బారికేడ్లు వేసి, నలువైపులా ఉన్న రోడ్లను మూసివేసి వారిని నిర్బంధించడం ఏ నాగరిక సమాజంలో ఉన్నాం అనిపిస్తోంది.

### పాత నేరస్తులే.. అయినా చర్యలు శూన్యం..

విశేషమేమిటంటే.. దాడులకు తెగబడ్డ వీరిపై ఇప్పటికే జగద్గిరిగుట్టతో పాటు హైదరాబాద్‌లోని పలు పోలీస్ స్టేషన్లలో కిడ్నాపులు, ల్యాండ్ కబ్జాలు, బెదిరింపుల కేసులు నమోదై ఉన్నాయి. గతంలో ఇదే స్టేషన్ పరిధిలో డీసీపీ ఆధ్వర్యంలో బైండోవరులు కూడా చేశారు. అయినా సరే, చట్టం పట్ల ఏమాత్రం గౌరవం, భయం లేకుండా మళ్లీ అదే స్థలంలో దాడులకు తెగబడ్డారంటే.. వీరి వెనుక ఉన్న రాజకీయ హస్తం ఎవరిది.?

### ప్రశ్నిస్తున్నాం.. సమాధానం చెప్పండి..

వందల మంది ముసుగులు వేసుకొని వచ్చి దాడి చేస్తుంటే పోలీసు ల నిఘా వ్యవస్థ ఏం చేస్తోంది.? బైండోవర్ అయిన



వ్యక్తులు మళ్ళీ దాడులు చేస్తుంటే చూస్తూ ఎందుకు ఊరుకుంటున్నారు అంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ప్రజాప్రతినిధుల స్పందించారా.?

ఓట్ల కోసం కాళ్ళావేళ్ళా పడే నాయకులు, తమ కళ్ళముందే పేదల ఇళ్లపై దాడులు జరుగుతుంటే నోరు మెదపరేం.? దౌర్జన్యం చేస్తున్న వారికి మీరు సపోర్ట్ చేస్తున్నారా.? అందుకే మౌనంగా ఉంటున్నారా.? మా ఓట్లు కావాలి కానీ మా కష్టం పట్టించుకోరా అంటూ ప్రశ్నిస్తున్నారు.

### అధికారులు కోర్టు తీర్పుకు, నిబంధనలకు విలువ ఇవ్వరా.?

కోర్టు తీర్పులకు, నిబంధనలకు విలువ లేదా.? ప్రజలు చనిపోతేనే గాని మీకు చీమ కుట్టినట్టు ఉండదా.?
ఈ అక్రమ కట్టడాలను, బారికేడ్లను తొలగించి, దాడికి పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని బాధితులు వేడుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత వ్యవస్థలు స్పందిస్తాయా.? లేక పేదల ప్రాణాలు గాలిలో కలవాల్సిందేనా.? వేచి చూడాలి.

# అత్యధిక స్థానాలు" కాంగ్రెస్" వే

నిజామాబాద్(ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ మొదటి విడతల సర్పంచ్ ఎన్నికల్లో గెలిచిన విధంగానే రెండవ విడతలో కూడా అత్యధిక స్థానాలు గెలిచి ముందంజలో ఉందని నిజామాబాదు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నగేష్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు,చేస్తున్న అభివృద్ధిని చూసి ప్రజలు కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించడం జరిగింది. ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉంచిన నమ్మకాన్ని నెరవేర్చే విధంగా ప్రతి గ్రామాన్ని అభివృద్ధిలో ముందు ఉంచుతాము. రెండవ విడతలో జరిగిన 196 సర్పంచ్ స్థానాలకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు దాదాపు 137 స్తనాలు కైవసం చేసుకోవడం జరిగింది. ఇందులో దాదాపు సగం స్తనాలు ఎన్నికల కంటే ముందే కాంగ్రెస్ అభ్యర్థులకు ఏకగ్రీవం అయ్యాయి. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా రాష్ట్రంలో ప్రజాపాలన ఎంత విజయవంతంగా చేస్తున్నారో ప్రజలు ఏ విధంగా కాంగ్రెస్ పార్టీ పక్షాన ఉన్నారో తెలపడానికి ఇదే నిదర్శనం. ఎన్నికల్లో విజయం సాధించిన అభ్యర్థులకు అభినందనలు తెలుపుతూనే ఇందుకు సహకరించిన కాంగ్రెస్ నాయకులకు మరియు ఓటు వేసి కాంగ్రెస్ నాయకులను గెలిపించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.



# శాకాహారుల కోసం పసందైన రుచులతో 'శుద్ధ్ విలాస్'..

శాకాహారుల కోసం ప్రత్యేకమైన రెస్టారెంట్లు చాలా అరుదుగా ఉంటాయి. ఇక ప్యూర్ వెజ్ రెస్టారెంట్లకు ఎప్పుడూ డిమాండ్ ఉంటూనే ఉంటుంది. రకరకాల వంటకాలతో, పసందైన రుచులతో శాకాహారుల్ని ఆకట్టుకునేందుకు నగరంలో 'శుద్ధ్ విలాస్' ప్రారంభమైంది.మల్కాజ్ గిరిలో ఈ న్యూ బ్రాంచ్‌ను సక్సెస్ ఫుల్ హీరో శ్రీ విష్ణు ఓపెన్ చేశారు. రెస్టారెంట్‌ను ఓపెన్ చేయడమే కాకుండా అక్కడ అన్ని రకాల వంటకాలను రుచి చూశారు. అన్ని రకాల వెరైటీ వంటకాలు అద్భుతంగా ఉన్నాయని ప్రశంసించారు. ఈ సందర్భంగా.. శ్రీ విష్ణు మాట్లాడుతూ.. 'నేటి అర్బన్, బిజీ లైఫ్ స్టైల్‌లో క్లీన్, క్వాలిటీ, హెల్దీ ఫుడ్‌కు డిమాండ్ పెరిగింది. మరీ ముఖ్యంగా శాకాహార భోజనాన్ని అందరూ ఇష్టపడుతున్నారు. వెజ్‌నే అందరూ ప్రిఫర్ చేస్తున్నారు. ప్రజల అభిరుచికి తగ్గట్టుగా ప్రారంభించిన 'శుద్ధ్ విలాస్' యాజమాన్యానికి ఆల్ ది బెస్ట్. శాకాహార ప్రియులందరికీ ఈ రెస్టారెంట్ హాట్ ఫేవరేట్‌గా మారుతుందని విశ్వసిస్తున్నాను' అని అన్నారు. బ్రాండ్ యజమానులు శశికాంత్, శ్రీరామ్ మాట్లాడుతూ.. ఈ 'శుద్ధ్ విలాస్'ను భారతీయ పాక శాస్త్ర సంప్రదాయాల్లోని ప్రామాణిక శాకాహార వంటకాలను అందించే లక్ష్యంతో, స్వచ్ఛత, స్థిరత్వం, భోజన ప్రియుల సంతృప్తి కోసం రాజీలేని ప్రమాణాలను కొనసాగిస్తామని తెలిపారు. సమీప భవిష్యత్తులో బ్రాండ్‌ను ఇతర ప్రదేశాలకు విస్తరించే ప్రణాళికలను కూడా వారు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారంతా కూడా ఇక్కడి రుచికరమైన భోజనాన్ని ఆస్వాధించారు.



## ప్రేక్షకాభిమానుల హృదయాలలో
# శోభన్ బాబుది శాశ్వత స్థానం



నటుడిగా, వ్యక్తిగా నటభూషణ శోభన్ బాబుకు ఓ ప్రత్యేక స్థానం ఉందని సీనియర్ నటుడు మురళీమోహన్ అన్నారు. శోభన్ బాబు కథానాయకుడిగా రూపొందిన 'సోగ్గాడు' చిత్రం 50 ఏళ్లు పూర్తిచేసుకుంటున్న సందర్భంగా సురేష్ ప్రొడక్షన్స్, అఖిల భారత శోభన్ బాబు సేవా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 19న హైదరాబాద్ లో స్వర్ణోత్సవ వేడుకను నిర్వహించబోతున్నారు. అలాగే సురేష్ ప్రొడక్షన్స్ అదే రోజున ఈ సినిమాను రీ రిలీజ్ చేయనుంది. ఈ క్రమంలో హైదరాబాద్ లోని రామానాయుడు స్టూడియోలో స్వర్ణోత్సవ కర్టెన్ రైజర్ (ముందస్తు) ఈవెంట్ ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీనియర్ నటుడు మురళీమోహన్ మాట్లాడుతూ, "నాకు తొలి అవకాశం ఇచ్చింది నిర్మాత అట్లూరి పూర్ణచంద్రరావు అయితే నన్ను ప్రోత్సహించింది దాసరి నారాయణరావు, నన్ను సినిమా రంగంలోనికి రమ్మని ఆహ్వానించింది శోభన్ బాబు. నా జీవితంలో ఈ ముగ్గురినీ ఎన్నటికీ మరచిపోలేను. శోభన్ బాబుతో నేను 'ముగ్గురు మిత్రులు' అనే చిత్రం కూడా తీశాను. క్రమశిక్షణకు ఆయన మారుపేరు. ఆయన నుంచి నాలాంటి వారెందరో స్ఫూర్తి పొందారు. మా బ్యానర్ లో తీసిన "అతడు' సినిమాలో ఓ ముఖ్య పాత్ర కోసం ఆయనకు బ్లాంక్ చెక్కు ఇచ్చి నటించమని కోరాను. కానీ ఆయన అంగీకరించలేదు. అందాల నటుడిగా నాకున్న పేరును అలానే కొనసాగించాలంటే ఇతర పాత్రలు ఏవీ చేయకూడదని నిర్ణయించుకున్నట్టు అప్పట్లో నాకు చెప్పారు. ఆయన భౌతికంగా దూరమై 17 ఏళ్లు అయ్యింది. అంతకుముందు 13 సంవత్సరాలు పాటు ఆయన నటించలేదు. అంటే 30 ఏళ్లు గడిచినా శోభన్ బాబు ను గుర్తుపెట్టుకుని అభిమానులు మంచి మంచి కార్యక్రమములు నేటికీ చేస్తున్నారంటే...అది శోభన్ బాబు పట్ల వారికి ఉన్న ప్రేమ, గౌరవమే కారణం" అని అన్నారు.

## బాలీవుడ్‌పై కన్నేసిన
# రుక్మిణి వసంత్



కన్నడ బ్యూటీ రుక్మిణి వసంత్ అతి తక్కువ సమయంలోనే ఫుల్ ఫేమ్ సంపాదించుకుంది. తెలుగు, కన్నడ, తమిళ భాషల్లో హిట్ చిత్రాల్లో నటించి క్రేజీ బ్యూటీగా మారిపోయింది. ఇటీవల 'కాంతార చాప్టర్-1' సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న ఈ భామకు ఆఫర్లు క్యూ కడుతున్నాయి. ప్రస్తుతం కథలు వింటున్న రుక్మిణి వసంత్.. బాలీవుడ్ సినిమాల్లో నటించేందుకు ఆసక్తి చూపిస్తోంది. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రుక్మిణి వసంత్ తనకు హిందీ భాషపై ఉన్న మక్కువను వెల్లడించింది. "కాంతార'లో కనకవతి పాత్ర తర్వాత నాకు చాలా అవకాశాలు వస్తున్నాయి. నాతో చాలామంది చర్చలు జరుపుతున్నారు. నా తదుపరి ప్రాజెక్ట్ కోసం నేను చాలా ఎక్సైటింగ్‌గా ఉన్నాను. హిందీలో నటించాలని ఆశపడుతున్నాను. హిందీ నాకు చిన్నప్పటి నుంచి తెలిసిన భాష. ఎప్పుడూ హిందీ సినిమాలతో పరిచయం ఉండేది. బహుశా ఇది సైనిక నేపథ్యం వల్ల కావచ్చు. ఎందుకంటే ప్రతి కంటెన్మెంట్‌ను మరొకదానితో కలిపే వారధి హిందీ. నా విషయంలో అది అక్కడే మొదలై ఉండాలి. హిందీలో నా నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి నేను చాలా ఉత్సాహంగా ఉన్నా. ఆ భాషతో భావోద్వేగాలను పలికించే అవకాశం నాకు ఇంకా రాలేదు. దేవుడి దయ వల్ల నేను త్వరలోనే హిందీలో నా ప్రయాణాన్ని ప్రారంభిస్తానని అనుకుంటున్నాను. ఈ సంవత్సరం జరిగిన అద్భుతాలన్నింటినీ నేను గుర్తు చేసుకుంటున్నాను. ఇప్పటివరకు సెట్‌లో, పని చేస్తూ పుట్టినరోజు జరుపుకునే అదృష్టం నాకు లభించలేదు. రాబోయే రోజుల్లో అలా జరగబోతున్నందుకు నేను ఉత్సాహంగా ఉన్నాను" అని చెప్పుకొచ్చింది. ఇప్పటికే ఓ హిందీ సినిమాలో నటించిన ఈ అమ్మడు మరికొన్ని ప్రాజెక్ట్స్ చేయాలని ఆసక్తి చూపిస్తోంది. కాగా.. ప్రస్తుతం రుక్మిణి వసంత్ 'టాక్సిక్' మూవీలో నటిస్తోంది. యష్ హీరోగా చేస్తుండగా.. నయనతార, కియారా అద్వానీ, హుమా ఖురేషి, అక్షయ్ ఒబెరాయ్, సుదేవ్ నాయర్ కీలక పాత్రలో కనిపించబోతున్నారు. ఈ చిత్రానికి గీతు మోహన్ దాస్ దర్శకత్వం వహిస్తుండగా.. కెవిఎన్ ప్రొడక్షన్స్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమా వచ్చే ఏడాది మార్చి 19న పాన్ ఇండియా రేంజ్‌లో విడుదల కానుంది.

## అందమైన మెలోడీగా
# 'సహన సహన..'



ప్రభాస్, డైరెక్టర్ మారుతి, హౌస్ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ కాంబినేషన్‌లో రూపొందుతున్న మూవీ 'రాజా సాబ్'. ఈ సినిమా నుంచి సెకండ్ సింగిల్ 'సహన సహన..' అప్డేట్ వచ్చేసింది. ఈ బ్యూటీఫుల్ మెలోడీ సాంగ్ ప్రోమోను ఆదివారం రిలీజ్ చేశారు. 'సహన సహన..' ఫుల్ లిరికల్ సాంగ్‌ను ఈ నెల 17న సాయంత్రం 6.35 నిమిషాలకు రిలీజ్ చేయబోతున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సాంగ్‌లో ప్రభాస్ కలర్‌ఫుల్ ట్రెడిషనల్ కాస్ట్యూమ్స్‌తో ఆల్ట్రా స్టైలిష్ వైబ్ క్రియేట్ చేస్తున్నారు. ఈ సాంగ్‌ను మ్యూజిక్ సెన్సేషన్ తమన్ తన కెరీర్ బెస్ట్ మెలోడీగా కంపోజ్ చేశారు. ప్రభాస్, నిధి అగర్వాల్‌పై చిత్రీకరించిన ఈ పాటలోని స్టన్నింగ్ లొకేషన్స్ హైలైట్‌గా నిలుస్తున్నాయి. సంక్రాంతి సందడిని రెట్టింపు చేసేందుకు జనవరి 9న ఈ సినిమా వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. హర్రర్ కామెడీ జోనర్‌లో ఎవర్ గ్రీన్ మూవీగా నిలిచిపోయేలా దీన్ని తెరకెక్కిస్తున్నారు దర్శకుడు మారుతి. ఈ సినిమాను భారీ ప్రొడక్షన్ వ్యాల్యూస్‌తో అన్ కాంప్రమైజ్డ్‌గా నిర్మిస్తున్నారు నిర్మాతలు టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ ఈ చిత్రంలో హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. ఈ సినిమా రిలీజ్ కోసం రెబల్ స్టార్ ఫ్యాన్స్‌తో పాటు వరల్డ్ వైడ్ ఆడియెన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## డెకాయిట్ టీజర్ విడుదలకు
# తేదీ ఫిక్స్



టాలీవుడ్‌లో ఆసక్తికరమైన సినిమాల జాబితాలో 'డెకాయిట్' ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. అడివి శేష్ హీరోగా తెరకెక్కుతున్న ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన టీజర్ డిసెంబర్ 18న రాబోతున్న వార్త బయటకు రావడంతో అభిమానుల్లో ఉత్సాహం రెట్టింపు అయింది. బ్లాస్ట్ చేయబోతుందంటూ పెట్టిన ఓ పోస్ట్‌తో సోషల్ మీడియాలో హడావిడి మొదలైంది. ఈ టీజర్‌లో అడివి శేష్ పాత్ర చాలా డిఫరెంట్‌గా ఉండబోతుందనే టాక్ వినిపిస్తోంది. రా అండ్ ఇంటెన్స్ యాక్షన్, ఎమోషనల్ డెప్త్ కలిసిన పాత్రలో శేష్ కనిపించనున్నాడని సమాచారం. ముఖ్యంగా ఆయన లుక్, బాడీ లాంగ్వేజ్ టీజర్‌లో ప్రధాన హైలైట్‌గా నిలవబోతున్నాయట. బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కూడా సినిమాపై అంచనాలను మరో లెవల్‌కు తీసుకెళ్లేలా ఉండనుందని అంటున్నారు. దర్శకుడు ఈ సినిమాను పూర్తిగా స్టైలిష్ యాక్షన్ డ్రామాగా మలుస్తున్నారని ఇండస్ట్రీ వర్గాల్లో టాక్. టీజర్ ద్వారా కథా నేపథ్యం, హీరో క్యారెక్టర్ షేడ్స్‌ను కేవలం కొన్ని సెకన్లలోనే ఇంప్రెస్ చేసేలా చూపించనున్నారట. విజువల్స్, మేకింగ్ విలువలు పాన్ ఇండియా స్థాయికి తగ్గట్లుగా ఉంటాయని మేకర్స్ ధీమాగా చెబుతున్నారు. మొత్తానికి 'డెకాయిట్' టీజర్ అప్డేట్‌తో సినిమాపై క్రేజ్ మరింత పెరిగింది. కాగా.. 'డెకాయిట్' మూవీలో అడివి శేష్ సరసన మృణాల్ హీరోయిన్‌గా కనిపించనుంది. షానిల్ డియో దర్శకత్వంలో తెరకెక్కుతుండగా.. అనురాగ్ కశ్యప్, ప్రకాష్ రాజ్, సునీల్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఈ చిత్రం భారీ అంచనాల మధ్య వచ్చే ఏడాది మార్చి 19న ఉగాది పండుగ కానుకగా విడుదల కాబోతుంది.


## ఓటీటీలోకి రాబోతున్న
# ప్రియదర్శి రొమాంటిక్ చిత్రం




విభిన్న కథలు ఎంచుకుంటూ వరుస సినిమాలు చేస్తూ తన పాపులారిటీ పెంచుకుంటున్నాడు ప్రియదర్శి. ఒకప్పుడు పలు చిత్రాల్లో కమెడీయన్‌గా నటించిన మెప్పించిన ఆయన హీరోగా బాక్సాఫీసు వద్ద సత్తా చాటుతున్నాడు. ప్రియదర్శి, ఆనంది కాంబోలో వచ్చిన లేటెస్ట్ మూవీ 'ప్రేమంటే'. నవనీత్ శ్రీరామ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రాన్ని రానా స్పిరిట్ మీడియా సమర్పణలో పుస్కూర్ రామ్మోహన్ రావు, జాన్వీ నారంగ్ నిర్మించారు. ఈ రొమాంటిక్, కామెడీ మూవీలో సుమ కనకాల, వెన్నెల కిషోర్ కీలక పాత్రలో కనిపించారు. మధుసూధన్ అనే కుర్రాడు.. రమ్య (ఆనంది)అనే అమ్మాయిని పెళ్లి చేసుకుంటాడు. కొన్ని విషయాలు తెలిసినా సరే వైవాహిక జీవితంలోకి అడుగుపెడతాడు. కానీ వీరిద్దరి మధ్య నిత్యం గొడవలే తలెత్తుతాయి. అయినప్పటికీ రాత్రి వరకు అన్ని సర్ధుకుంటాయి. ఇక మధుసూదన్, రమ్య జీవితంలో ఎలాంటి పరిస్థితులు ఎదురయ్యాయి? అనేది స్టోరీ. ఈ సినిమా నవంబర్ 21న థియేటర్స్‌లోకి వచ్చి మిక్స్‌డ్ టాక్‌ను సొంతం చేసుకుంది. తాజాగా, 'ప్రేమంటే'డిజిటల్ స్ట్రీమింగ్‌కు సిద్ధమైంది. నెల రోజుల్లోనే స్ట్రీమింగ్ అందుబాటులోకి రాబోతుంది. ఈ సినిమాకు సంబంధించిన ఓటీటీ హక్కులను ప్రముఖ సంస్థ నెట్‌ఫ్లిక్స్ సొంతం చేసుకోగా.. డిసెంబర్ 19 నుంచి స్ట్రీమింగ్ అందుబాటులోకి రాబోతున్నట్లు ట్విట్టర్ ద్వారా ప్రకటించారు. ఈ అందమైన వైభవాలు వేడుకే 'ప్రేమంటే' తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో అందుబాటులోకి రాబోతుందని తెలిపారు. ఇక ఈ విషయం తెలుసుకున్న సినీ ప్రియులు ఖుషీ అవుతున్నారు.

# భిన్న ప్రేమకథతో 'ఇట్లు అర్జున'

వాట్ నెక్స్ట్ ఎంటర్టైన్మెంట్స్ తన తొలి ప్రొడక్షన్‌ను 'ఇట్లు అర్జున'తో ప్రారంభించింది. సక్సెస్ ఫుల్ దర్శకుడిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించిన వెంకీ కుడుముల కంటెంట్ బేస్డ్ కథలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో నిర్మాతగా కొత్త జర్నీని ప్రారంభించారు. నూతన దర్శకుడు మహేష్ ఉప్పల దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో అనిష్‌ను హీరోగా పరిచయం చేస్తున్నారు. అనస్వర రాజన్ హీరోయిన్. తాజాగా విడుదలైన 'సోల్ ఆఫ్ అర్జున' ఈ మూవీ వరల్డ్‌ని అద్భుతంగా ప్రజెంట్ చేసింది. ఈ గ్లింప్స్ నాగార్జున అందించిన మ్యాజికల్ వాయిస్ ఓవర్‌తో ప్రశాంతంగా, కవిత్వాత్మకంగా ప్రారంభమవుతుంది.ప్రేమ స్వచ్ఛత, లోతును ఆయన మాటలు గొప్ప ఆవిష్కరిస్తాయి. ఆ వర్ణనలోనే అర్జున పరిచయమౌతాడు. అర్జున మాట్లాడలేడు, కానీ నిశ్శబ్దం అతనిని బలహీనపరచదు, అతని భావోద్వేగాలను తగ్గించదు. అతని ధైర్యం, బలం ఈ టీజర్‌లో ప్రజెంట్ చేసిన తీరు ఆకట్టుకుంది. డెబ్యూ హీరోగా అనీష్ ఆకట్టుకునే నటన కనబరిచాడు. ఫిట్‌గా, కాన్ఫిడెంట్‌గా కనిపించాడు. డైలాగ్స్‌కు ఆస్కారం తక్కువగా ఉండే పాత్రలో భావ వ్యక్తీకరణ, బాడీ లాంగ్వేజ్‌తోనే కథను మోయడం ప్రశంసనీయం. కళ్లలో కనిపించే ఇంటెన్సిటీ అతన్ని పూర్తి హీరో మెటీరియల్‌గా నిలబెడతాయి. సాహసో పేతమైన జంప్స్, రా ఫిజికాలిటీతో కూడిన యాక్షన్ షాట్స్ గొప్ప యీజ్‌తో చేశాడు. అనస్వర రాజన్ ఫ్రేమ్‌కు తాజాదనాన్ని తీసుకొస్తుంది. లీడ్ పెయిర్ మధ్య కెమిస్ట్రీ సహజంగా అనిపిస్తూ, గ్లింప్స్‌లోనే కథ భావోద్వేగాన్ని ప్రేక్షకుల హృదయానికి చేరువ చేస్తుంది.



# సికింద్రాబాద్‌లో ఘనంగా నేషనల్ బైబిల్ కాన్ ఫెరెన్స్

- హాజరైన రెండు తెలుగు రాష్ట్రాల ప్రతినిధులు - వాక్యాధారమైన సమాజ నిర్మాణమే లక్ష్యం
- లేఖానుసారమైన:యషువ మెస్సియ నామం,ధర్మశాస్త్రము, బైబిల్ పండుగలు, సబ్బాత్ ఆరాధన దినము అనుసరించుట
- నేషనల్ బైబిల్ కాన్ఫరెన్స్ వ్యవస్థాపకులు ప్రొపెసర్ డాక్టర్ యస్. జాన్ రాజ్








**సికింద్రబాద్(ప్రశ్న న్యూస్)** పరిశుద్ధమైన బైబిల్ గ్రంథం ప్రకారం వాక్యాధారమైన సమాజ నిర్మాణమే లక్ష్యంగా నేషనల్ బైబిల్ కాన్ఫరెన్స్(యన్.బి.సి) టీమ్ పనిచేస్తుందని నేషనల్ బైబిల్ కాన్ఫరెన్స్ వ్యవస్థాపకులు, ప్రొపెసర్ డాక్టర్ యస్. జాన్ రాజ్ అన్నారు. సేయింట్ థామస్ క్యాతడ్రాల్ తమిళ్ చర్చ్ కాంఫరెన్స్ హాల్, ఆల్ఫా ఓటల్ దగ్గర, సికింద్రబాద్ లో సోమవారం యన్.బి.సి ఎగ్జిక్యూటివ్ లీడర్స్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రొఫెసర్ డాక్టర్ యస్. జాన్ రాజ్ మాట్లాడుతూ వాక్యాధారమైన బోధలను ఈ సమాజానికి అందించి వారిని సర్వసత్యం వైపు నడిపించుటకొరకు సేవకులు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. అదేవిధంగా బైబిల్ కు వ్యతిరేకంగా బైబిల్లో లేని పండుగలు, ఆరాధ దినములు చేయు బోధనలను ఖండించాలి, లేదా వారికి అవగాహన కల్పించాలన్నారు. వచ్చే 2026 సంవత్సరం నుండి భారతదేశంలోని అన్ని రాష్ట్రాల్లో యన్.బి.సి ద్వారా అనేక కార్యక్రమాలు జరుగుతాయని తెలియజేశారు. %చీదీజ షవఎంట్‌వ ఒఒఒ. అవెష్మఖఎఅఅనఅఖ. శీతీస్త్ర% ప్రారంభిచడం జరిగింది. దీనికి ముఖ్య అతిథులుగా దేవుని సంఘం అధ్యక్షులు దొరబాబు నేషనల్ ఎగ్జిక్యూటివ్ లీడర్స్ డాక్టర్ ఐజక్ ఇ.కుసుమ,ఎల్డర్ పాలడుగు రత్నపాల్,బ్రదర్ విజయానంద్, బ్రదర్ సూర్యారాజ్,ఎల్డర్ టి. సత్యవాధి,బ్రదర్ ఆనంద బాబు,బ్రదర్ కుసుమ ప్రకాష్ నంద, బ్రదర్ టి. దొరబాబు, సిస్టర్ జానే దొరక్కాస్ తదితరులు మాట్లాడినారు ఎల్డర్ వి. పాల్సన్ బాబు, బ్రదర్ ప్రసాద్, బ్రదర్ దేవసహాయం సహకరించారు.ఈ మీటింగ్ లో యన్.బి.సి. యొక్క వెబ్ సైట్ ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో దేవుని, యావె సంఘపాస్టర్లు సువార్తికులు,పెద్దలు వివిధ ప్రాంతాల సంఘస్తులు హాజరైనారు.

# బస్సులు ఆపాలని వినతి



**మంథని( ప్రశ్న న్యూస్)** మంథని పట్టణంలోని గోదావరిఖని వెళ్లే దారిలో నూతనంగా ఏర్పాటు చేసిన బస్టాప్ వద్ద ప్రయాణికుల సౌకర్యం బస్సులు ఆపాలని మంథని పట్టణానికి చెందిన పిల్లి సత్తయ్య ఆర్డీవోకు, ఆర్టీసీ డిపో మేనేజర్ కు, జిల్లా కలెక్టర్ కు, మున్సిపల్ కమిషనర్ కు వినతిపత్రం సమర్పించారు. సోమవారం వినతిపత్రం సమర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ తన కొడుకు పెళ్లి సాయికిరణ్ అకాల మరణం చెందగా ఆయన జ్ఞాపకార్థం సుమారు పది లక్షలతో బస్ షెల్టర్ నిర్మించడం జరిగిందని బస్సులు ఇక్కడ ఆపకపోవడంతో ప్రయాణికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బస్సులు ఆపే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## ప్రజాస్వామ్యం పై విశ్వాసాన్ని చాటిన

# తడగొండ వాసి కట్ట బాబు

- సొంత ఖర్చులతో విచ్చేసి ఓటు వేసిన గల్ఫ్ కార్మికుడు : బాబు



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, తడగొండ గ్రామానికి చెందిన కట్ట బాబు గత 22 ఏళ్లుగా గల్ఫ్ దేశాల్లో కార్మికునిగా జీవనం సాగిస్తున్నారు. విదేశాల్లో ఉన్నప్పటికీ ప్రజాస్వామ్యంపై తన నిబద్ధతను చాటుకుంటూ, ఆదివారం ప్రభుత్వం నిర్వహించిన రెండో విడత పంచాయతీ ఎన్నికల్లో కేవలం తన ఓటు హక్కును వినియోగించుకునేందుకే స్వంత ఖర్చులతో స్వదేశానికి వచ్చి ఓటు వేశారు.ఈ సందర్భంగా కట్ట బాబు మాట్లాడుతూ "ఎన్ని సంవత్సరాలు విదేశాల్లో ఉన్నా నా గ్రామం, నా దేశం అంటే అపారమైన ప్రేమ ఉంది. ఓటు హక్కు ప్రతి పౌరుడికి ఉన్న అమూల్యమైన బాధ్యత. గ్రామాభివృద్ధి, మంచి పాలన కోసం నా ఓటు తప్పకుండా వేయాలనే సంకల్పంతోనే వచ్చాను. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నిర్లక్ష్యం చేయకుండా వినియోగించుకోవాలి" అని అన్నారు.విదేశాల్లో జీవనం సాగిస్తున్నప్పటికీ ఓటు హక్కు ప్రాధాన్యతను నిరూపించిన కట్ట బాబు చర్య గ్రామస్థులకు ఆదర్శంగా నిలిచింది.

## నగరంపల్లి గ్రామ సర్పంచ్ ను శాలువాతో సత్కరించిన సింగిల్ విండో ఛైర్మన్ కొత్త శ్రీనివాస్



**మంథని ( ప్రశ్న న్యూస్)** మంథని మండలం నగరంపల్లి గ్రామానికి నూతనంగా ఎన్నికైన సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులను సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ శాలువాతో సోమవారం సాయంత్రం ఘనంగా సత్కరించారు. స్థానిక సింగిల్ విండో కార్యాలయంలో సర్పంచ్ నాతరి లత-శ్రీనివాస్, ఉపసర్పంచ్ పొరెడ్డి ప్రసన్న-తిరుపతి రెడ్డి, వార్డు సభ్యులు నౌండ్ల సదానందం, మల్యాల కిరణ్ కుమార్, తోకల శ్రీనివాస్, ఏట శ్రీనివాస్ లను సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ ఘనంగా సత్కరించి శుభాకా%శీ%క్షలు తెలిపారు. తమ విజయానికి కృషి చేసిన ఐటీ, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, టీపిసిసి ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ళ శ్రీనుబాబు, సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, గ్రామస్తులకు, నాయకులు, కార్యకర్తలకు, ప్రజాప్రతినిధులకు ఈ సందర్భంగా సర్పంచ్, వార్డు సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు శీలం ప్రభాకర్, బూడిద రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల విశ్వాసానికి నిదర్శనం

## - సర్పంచ్ అనుముల భాస్కర్ విజయం

- బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ : కల్వకుంట్ల తారకరామారావు
- నీలోజిపల్లి సర్పంచ్ భాస్కర్ కు కేటీఆర్ శుభాకాంక్షలు - సన్మానం



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, నీలోజిపల్లి గ్రామ సర్పంచిగా ఘన విజయం సాధించిన బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి అనుముల భాస్కర్ బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, సిరిసిల్ల నియోజకవర్గ శాసనసభ్యులు కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్)ను సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో భాస్కర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్ భాస్కర్‌ను శాలువాతో ఘనంగా సన్మానించి, అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ నీలోజిపల్లి గ్రామ ప్రజలు భాస్కర్‌పై ఉంచిన నమ్మకానికి ఈ విజయం నిదర్శనమని పేర్కొన్నారు. నీలోజిపల్లి గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సర్పంచ్ పనిచేయాలని సూచించారు. బీఆర్ఎస్ పార్టీ ఎప్పటికప్పుడు గ్రామపంచాయతీలకు అండగా నిలుస్తుందని, అభివృద్ధి పనులకు అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా పారదర్శకంగా, సమర్థవంతంగా పాలన అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్,బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ చెన్నాడి అమిత్ కుమార్,పార్టీ బోయినిపల్లి మండలాధ్యక్షులు కత్తెరపాక ఉమా కొండయ్య,నాయకులు కొనుకటి లచ్చయ్య,తదితర నాయకులు,కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధికి

# సమిష్టి కృషి అవసరం

- బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ : కేటీఆర్
- దేశాయిపల్లి సర్పంచ్ నిమ్మ భాగ్యలక్ష్మి - శ్రీనివాస్ రెడ్డి దంపతులకు కేటీఆర్ శుభాకాంక్షలు సన్మానం



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, దేశాయిపల్లి గ్రామ సర్పంచిగా ఘన విజయం సాధించిన బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి నిమ్మ భాగ్యలక్ష్మి - శ్రీనివాస్ రెడ్డి దంపతులను,ఉప సర్పంచ్ కురుమ మనోహర్ లను బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, సిరిసిల్ల నియోజకవర్గ శాసనసభ్యులు కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) సోమవారం సిరిసిల్లలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ "గ్రామ ప్రజల నమ్మకాన్ని గెలుచుకొని సర్పంచ్‌గా ఎన్నికవడం అభినందనీయం. దేశాయిపల్లి గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రజాప్రతినిధులుగా బాధ్యతాయుతంగా పనిచేయాలి.గ్రామాభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, ప్రజల సమస్యల పరిష్కారంలో బీఆర్ఎస్ పార్టీ ఎల్లవేళలా మీకు అండగా ఉంటుంది. సమష్టి కృషితో గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలి" అని సూచించారు.ఈ కార్యక్రమంలో చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్,బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నేత డాక్టర్ చెన్నాడి అమిత్ కుమార్,బీఆర్ఎస్ బోయినిపల్లి మండలాధ్యక్షులు కత్తెరపాక ఉమా కొండయ్య,నాయకులు కొంకటి శేఖర్,తదితర నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# నిబంధనల ఉల్లంఘన..

## 66 మందిపై కేసు

ఆదిలాబాద్, డిసెంబర్: రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో, ఎనిమిది మండలాల పరిధిలోని ఆరు పోలీస్ స్టేషన్లలో మొత్తం 66 మందిపై కేసులు నమోదు చేశారు. ఎన్నికల విధులకు ఆటంకం కలిగించడం, నియమావళిని ఉల్లంఘించడం, మద్యం, ఆహార పదార్థాలు, బహుమతులు పంపిణీ చేయడం, సమయం ముగిసినా ప్రచారం కొనసాగించడం వంటి కారణాలతో ఈ కేసులు నమోదయ్యాయి. భీంపూర్ మండలంలో 1, రూరల్ మండలంలో 8, మావాలలో 2, తాంసిలో 3, బేలలో 4, జైనథ్ మండలంలో 9 కేసులు నమోదయ్యాయి.

# కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలి



బోథ్, డిసెంబర్ : సీఐటీయూ జిల్లా కార్యదర్శి కిరణ్, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జాతీయ మహాసభలను పురస్కరించుకొని సోమవారం ఆదిలాబాద్‌లో సంఘం జెండా ఆవిష్కరించారు. కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని, ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమం కోసం కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఆశన్న, దర్శనాల మల్లేశ్, బండి దత్తాత్రి, మంజుల పాల్గొన్నారు.

# సోయా, మొక్కజొన్న కొనుగోళ్లు నిలిపివేతపై కలెక్టర్ కు వినతి

నిర్మల్, డిసెంబర్ : ఆదిలాబాద్ జిల్లాలోని అన్ని మార్కెట్ యార్డుల్లో ఇంకా అమ్మకానికి ఉన్న సోయాబీన్, మొక్కజొన్న పంటను వెంటనే కొనుగోలు చేయాలని అఖిల పక్ష రైతు సంఘం నాయకులు కలెక్టర్ రాజర్షి షా ను కోరారు. సోమవారం కలెక్టర్ ను కలిసి వినతి పత్రం సమర్పించిన నాయకులు, కొనుగోళ్ళను అర్ధాంతరంగా నిలిపివేయడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు బండి దత్తాత్రే, బోర్రన్న, కొండ రమేష్, లోకరి పోశెట్టి పాల్గొన్నారు.

# లారీని వెనుక నుంచి ఢీకొన్న ద్విచక్ర వాహనం

ముథోల్, డిసెంబర్ : నేరడిగొండ మండల కేంద్రంలోని దేవి ఫ్యామిలీ రెస్టారెంట్ పక్కన నేషనల్ ఎన్ హెచ్ 7 మీద నిర్మల్ వైపు నుండి మహారాష్ట్రకు వెళుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నిర్మల్ వైపు నుండి మహారాష్ట్రకు వెళుతుండగా ముందు ఉన్న లారీని వెనుక నుంచి వచ్చిన ద్విచక్ర వాహనం ఢీ కొట్టింది. దీంతో ద్విచక్ర వాహనం పై ఉన్న ఇద్దరికి స్వల్పగాయాలు అయ్యాయి. ద్విచక్ర వాహనం పై వెళ్తున్న వారు మహారాష్ట్రకు చెందిన వారిగా స్థానికులు తెలిపారు. క్షతగాత్రులను ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి తరలించినట్టు స్థానికులు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది

# విద్యుదాఘాతంతో యువకుడి మృతి

ఖానాపూర్, డిసెంబర్ : నిర్మల్ మండలంలోని పెంటునాయక్ తండాలో ఎన్నికల ప్రచారంలో భాగంగా సర్పంచి అభ్యర్థి కోసం టెంటు వేస్తుండగా విషాదం చోటుచేసుకుంది. టెంటుకు వాడే ఇనుప రాడ్డు విద్యుత్ తీగలకు తగలడంతో నవీన్ (23) అనే యువకుడు విద్యుదాఘాతంతో మృతిచెందాడు. మరో యువకుడు శ్యామ్ గాయపడ్డాడు. భైంసా ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా నవీన్ మరణించగా, శ్యామ్ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణారెడ్డి తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో ఆర్ఎంపీకి గాయాలు

కరీంనగర్, డిసెంబర్ : రాచర్లగొల్లపల్లికి చెందిన ఆర్ఎంపీ ఎంపీ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు పాతూరి ప్రవీణ్ రెడ్డి శనివారం రాత్రి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. గమనిం చిన స్థానికులు వెంటనే మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఎల్లారెడ్డి పేట నుంచి రాచర్ల గొల్లపల్లికి తన బైక్పై వెళ్తుం డగా గ్రామ శివారులో అదుపుతప్పి కిందపడి పోయాడు. ఈ సమాచారం అందుకున్న గొల పల్లి బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి కొండ రమేశ్ గౌడ్ ఘటన స్థలానికి చేరుకొని ఆస్పత్రికి తర లించారు. ప్రస్తుతం ప్రవీణ్ రెడ్డి చికిత్స పొందు తున్నారు. ప్రవీణ్ రెడ్డిని బీఆర్ఎస్ జిల్లా అధ్య క్షుడు తోట ఆగయ్య, రెడ్డి సంఘం జిల్లా అధ్య క్షుడు గుండారపు కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి పరామర్శించారు.

# ఒక్క ఓటుతో గెలిచిన సర్పంచులు వీరే

మానకొండూరు, డిసెంబర్: గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో కరీంనగర్ జిల్లాలో ఐదుగురు అభ్యర్థులు ఒక్క ఓటు తేడాతో సర్పంచ్ పీఠాన్ని కైవసం చేసుకున్నారు. కొత్తపల్లిలో శోభారాణి, పెద్దూరుపల్లిలో రామడుగు హరీష్, మహాత్మనగర్లో పొన్నాల సంపత్, ముంజంపల్లిలో నందగిరి కనక లక్ష్మి, అంబల్ పూర్లో వెంకటేశ్ ఈ అరుదైన విజయాన్ని సాధించారు. ఇదే తరహాలో వరంగల్ (%ఱ%) ఆశాలపల్లిలో కొంగర మల్లమ్మ, నల్గొండ(%ఱ%) ధన్సింగ్ తండాలో ధనావత్ కూడా గెలుపొందారు. ఈ ఎన్నికల ఫలితాలు పలువురిలో ఆసక్తిని రేకెత్తించాయి.

# గొల్లపల్లి సర్పంచ్ ఎన్నిక: ప్రవీణ్ భారీ మెజారిటీతో విజయం

హుజూరాబాద్, : తెలంగాణలో రెండో విడత సర్పంచ్ ఎన్నికలలో రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం గొల్లపల్లి గ్రామంలో రాడం ప్రవీణ్ 355 ఓట్ల భారీ మెజారిటీతో సర్పంచ్ పదవిని కైవసం చేసుకున్నారు. ఈ విజయాన్ని గ్రామస్థులు పండుగలా జరుపుకొని, ఊరేగింపు నిర్వహించారు. ఈ ఎన్నికలు డిసెంబర్ 15, 2025న జరిగాయి.

# బిఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలి..



చొప్పదండి, : కాంగ్రెస్ ప్రభుత్వం దిగి రావాలంటే బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం పెద్దపల్లి మండలం రాఘవాపూర్ గ్రామంలో పంచాయతీ ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు హామీలు ఇవ్వడం సులభం కానీ, వాటిని నిలబెట్టుకోవడంలో విఫలమైందని, రెండేళ్లుగా అసమర్థ పాలన సాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పేందుకు బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించడం అవసరమని ఆయన అన్నారు.

# గ్రేటర్ హైదరాబాద్‌లో సీఎన్‌జీ సంక్షోభం

## కార్లు పెరిగాయి గ్యాస్ లేదు గంటల తరబడి క్యూలే

- రోజురోజుకు తీవ్రమవుతున్న సిఎన్ జి సమస్య
- కేంద్ర ప్రభుత్వ వైఫల్యమే సిఎన్ జి కష్టాలు
- లక్షలలో వాహనాలు.. వందలలో ఫిల్లింగ్ స్టేషన్ లు

**(గజ్జెల శ్రీనివాస్ - ప్రశ్న న్యూస్ ప్రతినిధి)**






పర్యావరణ పరిరక్షణ, ఇంధన వ్యయ నియంత్రణ పేరుతో దేశవ్యాప్తంగా సిఎన్ జి (కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్) వాహనాలను ప్రోత్సహించిన కేంద్ర ప్రభుత్వ విధానం ఇప్పుడు వాహనదారులకు శాపంగా మారుతోంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధితో పాటు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా సిఎన్జీ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ, గంటల తరబడి ఫిల్లింగ్ స్టేషన్ల వద్ద క్యూలో నిలబడాల్సిన పరిస్థితి నెలకొంది.

### కార్లు పెరిగాయి, స్టేషన్లు మాత్రం పెరగలేదు..

కేంద్ర ప్రభుత్వం ఆటోమొబైల్ రంగాన్ని ప్రోత్సహిస్తూ సిఎన్జీ కార్ల ఉత్పత్తిని భారీగా పెంచింది. తక్కువ ఇంధన ఖర్చు, కాలుష్యం తగ్గుతుందనే ప్రచారంతో లక్షలాది మంది సిఎన్జీ వాహనాలు కొనుగోలు చేశారు. అయితే, ఆ మేరకు సిఎన్జీ ఫిల్లింగ్ స్టేషన్ల సంఖ్య పెంచకపోవడంతో వ్యవస్థ పూర్తిగా కుప్పకూలింది.
గ్రేటర్ హైదరాబాద్ వంటి మహానగరంలో కూడా అతి తక్కువ సంఖ్యలోనే సిఎన్జీ స్టేషన్లు ఉండటంతో, రోజురోజుకు వాహనాల సంఖ్య పెరుగుతున్నా గ్యాస్ సరఫరా మాత్రం అంతకంతకూ కష్టంగా మారుతోంది.

### ఒక గంట కాదు, మూడు గంటల వరకూ నిరీక్షణ..

ఉదయం, సాయంత్రం పీక్ అవర్స్‌లో సిఎన్జీ ఫిల్లింగ్ స్టేషన్ల వద్ద పరిస్థితి దారుణంగా మారుతోంది. కనీసం ఒక గంట నుంచి మూడు గంటల వరకు క్యూలో నిలబడాల్సిందేనని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా క్యాబ్ డ్రైవర్లు, ఆటో డ్రైవర్లు, డెలివరీ వాహనాల డ్రైవర్లు తమ పని గంటలంతా క్యూలోనే గడుపుతున్నారు.
ఈ ఆలస్యం కారణంగా రోజువారీ ఆదాయం కోల్పోతున్నామని, కుటుంబాలను పోషించుకోవడం కూడా కష్టంగా మారిందని వారు వాపోతున్నారు.

### సిఎన్ జి కొనుగోలు, పశ్చాత్తాపం..

తక్కువ ఖర్చుతో ప్రయాణించవచ్చనే నమ్మకంతో ఆశపడి సిఎన్జీ కార్లు కొనుగోలు చేసిన మధ్యతరగతి ప్రజలు ఇప్పుడు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. "పెట్రోల్ ఖర్చు తగ్గుతుందని సిఎన్జీ వాహనం కొంటే, ఇప్పుడు సమయమే ఎక్కువగా ఖర్చవుతోంది. గంటల తరబడి క్యూలో నిలబడటం వల్ల ఉద్యోగాలకు చాలా ఆలస్యం అవుతోంది" అని పలువురు వినియోగదారులు వాపోతున్నారు.కొంతమంది సిఎన్జీ కార్లను వినియోగించకుండా,తిరిగి పెట్రోల్‌పై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది దానితో సీఎన్జీ వాహనాలలో పెట్రోల్ మైలేజ్ అతి తక్కువ రావడంతో ఏం చేయాలో తెలియని పరిస్థితిలో అయోమయం చెందుతున్నారు.

### మౌలిక వసతుల లోపమే అసలు కారణం..

సిఎన్జీ వినియోగాన్ని ప్రోత్సహించడమే తప్ప, దానికి అవసరమైన ఇంధన మౌళిక సదుపాయాలపై కేంద్ర ప్రభుత్వం దృష్టి పెట్టలేదనే ఆరోపణలు తీవ్రంగా వెల్లువెత్తుతున్నాయి. సరైన ప్రణాళిక లేకుండా వాహనాల సంఖ్యను పెంచడం వల్లే నేడు ఈ సంక్షోభం తలెత్తిందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.
గ్యాస్ సరఫరా వ్యవస్థను విస్తరించకుండా, స్టేషన్ల సంఖ్యను పెంచకుండా తీసుకున్న నిర్ణయాలే నేటి సమస్యలకు మూలకారణమని అంటున్నారు.

### కేంద్ర ప్రభుత్వంపై విమర్శల వెల్లువ..

ఈ పరిస్థితికి పూర్తి బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని పలువురు వాహనదారులు, సామాజిక వర్గాలు ఆరోపిస్తున్నాయి. "సిఎన్జీ కార్లు కొనమని చెప్పింది కేంద్ర ప్రభుత్వమే. కానీ గ్యాస్ దొరకని పరిస్థితిని సృష్టించింది కూడా అదే ప్రభుత్వం" అంటూ తీవ్ర విమర్శలు చేస్తున్నారు.

### తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్..

గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు, వరంగల్, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్ నగర్ ఇలా తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా సిఎన్జీ ఫిల్లింగ్ స్టేషన్ల సంఖ్యను తక్షణమే పెంచాలని, గ్యాస్ సరఫరాను సక్రమంగా నిర్వహించాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే సిఎన్జీ వాహనాల వినియోగం పూర్తిగా అర్థహీనమవుతుందని హెచ్చరిస్తున్నారు.

### ముందుచూపు లేకపోతే మరింత సంక్షోభమే..

పర్యావరణ పరిరక్షణ పేరుతో తీసుకున్న విధానాలు ప్రజలకు ఉపశమనం కలిగించాల్సిన అవసరం ఉంది. కానీ ముందుచూపు లేని నిర్ణయాలు తీసుకుంటే అవే ప్రజలకు భారంగా మారతాయన్నదానికి సిఎన్జీ సంక్షోభమే ప్రత్యక్ష ఉదాహరణగా నిలుస్తోంది. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి, సిఎన్జీ వ్యవస్థను పటిష్టం చేయకపోతే రానున్న రోజుల్లో ఈ సమస్య మరింత తీవ్రరూపం దాల్చడం ఖాయమన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

## హెడ్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ తెలంగాణ రాష్ట్ర మహిళా విభాగం డైరెక్టర్ గా శ్రీవాణి చౌదరి నియామకం



ఉప్పల్ (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో కార్యకలాపాలు కొనసాగిస్తున్న హెడ్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ కు తెలంగాణా రాష్ట్రానికి చెందిన వి. శ్రీవాణి చౌదరిని తెలంగాణా రాష్ట్ర మహిళా విభాగం డైరెక్టర్ గా హెడ్ సంస్థ చైర్మన్ మాధవ్ నియమించారు. ఈ సందర్భంగా శ్రీవాణి చౌదరి మాట్లాడుతూ నా మీద నమ్మకం ఉంచి నన్ను మహిళా డైరెక్టర్ గా నియమించి నందుకు చైర్మన్ మాధవ్ నా నియామకానికి కృషి చేసిన జాతీయ ప్రధాన కార్యదర్శి సతీష్ దేవరకొండలకు ధన్యవాదాలు తెలిపారు. నా శక్తి మేరకు సంస్థ ఎదుగుదలకు కృషి చేస్తానని బాధితులకు అండదండగా ఉంటానని, బాధితులకు న్యాయం లభించే లాగా పోరాటం చేస్తానని స్పష్టం చేశారు. హెడ్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ తరఫున మానవ హక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉంటామని తెలిపారు. పదవి స్వీకరించినందుకుగాను సంస్థ సభ్యులు, పుర ప్రముఖులు శ్రీ వాణి చౌదరికి శుభాకాంక్షలు తెలియజేశారు.

## మహిళ హిజాబ్ లాగిన బీహార్ సీఎం నితీశ్ కుమార్

- ఒక వైద్యురాలికి ఆయుష్ సర్టిఫికెట్ ఇచ్చిన సమయంలో ఘటన



పాట్నా (ప్రశ్న న్యూస్) బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ఒక కార్యక్రమంలో ఆయుష్ వైద్యులకు నియామక పత్రాలు అందజేస్తుండగా ఒక మహిళ హిజాబ్‌ను లాగడం వివాదాస్పదమైంది. దీనిపై ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు గుప్పించాయి. పాట్నాలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఒక వైద్యురాలికి ఆయుష్ సర్టిఫికెట్‌ను ఆయన స్వయంగా అందజేశారు. ముఖ్యమంత్రి కార్యాలయంలో 1,000 మంది ఆయుష్ వైద్యులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఒక విద్యార్థినికి సర్టిఫికెట్ చేతికిచ్చిన నితీశ్, ఆమె హిజాబ్‌ను కొంతమేర తొలగించారు. ముఖ్యమంత్రి చర్యకు ఆ మహిళ ఏ విధంగానూ స్పందించకపోయినా, నిశ్చేష్టురాలై చూస్తూ ఉండిపోయారు. అయితే, ఉప ముఖ్యమంత్రి, బీజేపీ నేత సామ్రాట్ చౌధరి మాత్రం ముఖ్యమంత్రి నితీశ్ చర్యను ఆపేందుకు ప్రయత్నించారు. ముఖ్యమంత్రి చర్యపై కాంగ్రెస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. నితీశ్‌కు పూర్తిగా మతిభ్రమించినట్లు ఉందని విరుచుకుపడింది. ఆయన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. మహిళల పట్ల జేడీయూ, బీజేపీ ప్రభుత్వం వైఖరి ఏమిటో ఈ ఉదంతం ద్వారా వెల్లడవుతోందని ఆర్జేడీ అధికార ప్రతినిధి ఎజాజ్ అహ్మద్ పేర్కొన్నారు. గతంలో బీహార్ ఎన్నికల సమయంలోనూ నితీశ్ ఒక మహిళ మెడలో పూలదండ వేయడం వివాదాస్పదమైంది.

## సికింద్రాబాద్ సర్కిల్లో ఆగని అక్రమ నిర్మాణాలు

- ప్రజా ప్రతినిధి కనుసైగల్లో జోరుగా నిర్మాణాలు
- అడ్డగుట్ట డివిజన్ లో యథేచ్ఛగా అక్రమ కట్టడాలు
- ఫిర్యాదులు చేసిన పట్టించుకొని టౌన్ ప్లానింగ్ అధికారులు
- మూడు రోజులు ముచ్చటగా భవనాల సీజింగ్





**అడ్డగుట్ట (ప్రశ్న న్యూస్)** సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలకు అడ్డు అదుపు లేకుండా పోతోంది. టౌన్ ప్లానింగ్ అధికారుల, సిబ్బంది పర్యవేక్షణ కొరవడటంతో పాటు కొందరు ప్రజా ప్రతినిధుల అండదండలు పూర్తిగా ఉండటంతో నిబంధనలకు విరుద్ధంగా అడ్డగుట్ట డివిజన్ పరిధిలో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారుల కనుసన్నల్లోనే ఈ అక్రమ దందా దర్జాగా సాగుతోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అడ్డగుట్ట డివిజన్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు రహదారులపై కాలనీలలో యథేచ్ఛగా వెలుస్తున్నా అధికారులు పట్టించుకోవటం లేదనే విమర్శలున్నాయి. అడ్డగుట్టలో పక్కింటి నెంబర్ 10%-5-%529 లో నిబంధనలకు విరుద్ధంగా రెండు అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని ఎదురు ఎదురుగా ఈ భారీ అక్రమ నిర్మాణాలు జరుగుతున్న టౌన్ ప్లానింగ్ అధికారులు నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకోకుండా ఉండడం వెనుక లంచాలే కారణమా అని స్థానికులు ఆరోపిస్తున్నారు. అక్రమ నిర్మాణదారులకు టౌన్ ప్లానింగ్ అధికారులు సిబ్బంది ముందుగా ఎలివేషన్ పూర్తిచేసి రంగులు వేసి తరువాత భవనం లోపట పనులు కొనసాగించుకోమని సూచనలు సలహాలు ఇవ్వడంతో నగరవ్యాప్తంగా ఇదే తంతు కొనసాగుతుంది టౌన్ ప్లానింగ్ అధికారులు భారీగా లంచాలు తీసుకొని ఇలా అవినీతి అక్రమాలకు వడగడుతున్నారని ప్రజలు ఎన్ని ఫిర్యాదులు చేసినా పాలకులు స్పందించకపోవడం చూస్తుంటే అక్రమ నిర్మాణాలను పాలకులు ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలా చేయడం వల్ల ప్రభుత్వానికి భారీగా ఆదాయం గండి పడుతుందని అధికారులకు మాత్రం కోట్లల్లో డబ్బు అక్రమ సంపాదన వస్తుందని గుసగుసలు వినిపిస్తున్నాయి. నిబంధనల ప్రకారం సెట్‌బ్యాక్‌లు, పార్కింగ్ స్థలం వదిలిపెట్టకుండా, ఆదనపు అంతస్థులు ఇష్టారీతిగా కట్టుకుపోతున్నా మున్సిపల్ సిబ్బంది అటువైపు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే ఇక్కడి నిర్మాణాలకు అన్ని తానై ఓ నాయకుడు చక్రం తిప్పుతున్నట్లు పలు ఆరొపనలున్నాయి. అడ్డగుట్ట రహదారిపై కూడా రెండు అంతస్తులకు అనుమతి తీసుకొని కమర్షియల్ నిర్మాణం చేస్తూ నాలుగు ఐదు అంతస్తులు నిర్మిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. టౌన్ ప్లానింగ్ అధికారులు ఈ కట్టడాలపై చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. పేద, మధ్యతరగతి ప్రజలు చిన్న నిర్మాణం చేపట్టినా అనుమతుల కోసం పరుగుపెట్టాల్సి వస్తుంటే, పలుకుబడి ఉన్నవారు ఎలాంటి భయం లేకుండా నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని వాపోతున్నారు. దీనిపై ఉన్నతాధికారులు, డిప్యూటీ కమిషనర్ తక్షణమే స్పందించి, ప్రజా ప్రతినిధుల అండతో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## ఉపాధి హామీ పథకం నిర్వీర్యం చేసేందుకు కేంద్రం కుట్ర

- కేంద్రం నిర్ణయం రాష్ట్రాలను, పేదలను శిక్షించే విధంగా ఉందన్న సీతక్క



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును 'వికసిత్ భారత్-గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్'గా మార్చాలనే ప్రతిపాదనపై తెలంగాణ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క స్పందించారు. ఈ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని ఆమె ఆరోపించారు. పథకం పేరు మార్చడమే కాకుండా, దాని స్ఫూర్తిని, అమలు విధానాన్ని కూడా మార్చేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని మంత్రి సీతక్క డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంత పేదలకు ఉపాధి భరోసా కల్పించాలన్న మహాత్మాగాంధీ ఆలోచనలకు విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఆమె అన్నారు. ఈ నిర్ణయం పేదలను, రాష్ట్రాలను శిక్షించే విధంగా ఉందని ఆమె తీవ్రంగా విమర్శించారు. గతంలో ఈ పథకానికి వంద శాతం నిధులను సమకూర్చి అమలు చేసిన కేంద్రం, ఇప్పుడు తన వాటాను 60 శాతానికి తగ్గించి, మిగిలిన 40 శాతం భారాన్ని రాష్ట్రాలపై మోపడం అన్యాయమని ఆమె పేర్కొన్నారు. ఈ నిర్ణయం రాష్ట్రాల ఆర్థిక పరిస్థితిపై తీవ్ర ప్రభావం చూపుతుందని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తన బాధ్యతల నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తోందని ఆమె అన్నారు. పథకం పేరు నుంచి మహాత్మాగాంధీ పేరును తొలగించడం ద్వారా గాంధీజీ ఆలోచనలు, విలువల పట్ల కేంద్ర ప్రభుత్వానికి ఉన్న వ్యతిరేక వైఖరి స్పష్టంగా కనిపిస్తోందని ఆమె అన్నారు. మోదీ ప్రభుత్వానికి మొదటి నుంచి ఈ పథకం పట్ల వ్యతిరేకత ఉందని, అందుకే దశలవారీగా ఈ పథకాన్ని బలహీనపరిచే కుట్రలకు తెరలేపారని ఆమె ఆరోపించారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588